




# ప్రజావీక్షణం
దినపత్రిక
ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

PJV ప్రజా వీక్షణం టీవీ

Subscribe

www.prajaveekshanam.in | సంపుటి:16 | సంచిక :289 | 12 శనివారం సెప్టెంబర్ 2026 | పేజీలు : 08 | వెల:రూ.2/-

Published from : Vijayawada, Krishna, Guntur, Kakinada, Vishakhapatnam, Vijayanagaram, Prakasham, Kadapa, Kurnool, Tirupathi, Anantapur, East Godavari, West Godavari


# గల్వాన్ తర్వాత మారుతున్న సీన్..

- మోదీతో జిన్‌పింగ్ భేటీకి ముందు చైనా కీలక ప్రకటన
- విభేదాలను పరిష్కరించుకుంటామని స్పష్టీకరణ
- 2019 తర్వాత భారత్‌కు జిన్‌పింగ్ తొలిసారి రాక
- 2024లో గస్తీ ఒప్పందంతో కీలక పరిణామం
- వరుసగా మూడో ఏడాది మోదీ-జిన్‌పింగ్ భేటీ
- బ్రిక్స్ సహకారంపై జిన్‌పింగ్ కీలక ప్రసంగం



ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

...మిగతా 2 లో...



## బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ.. నలుగురు నిందితుల అరెస్ట్: సీవీ ఆనంద్ సంచలన వివరాలు

- ఆగస్ట్ 31న బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో ఆయుధాల చోరీ
- ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ ల సహకారం
- 28, 29 తేదీల్లో రెక్కీ నిర్వహించిన మల్లేశ్

హైదరాబాద్‌లోని బొల్లారంలో ఉన్న మద్రాస్ రెజిమెంట్ బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లో జరిగిన భారీ ఆయుధాల చోరీ కేసును పోలీసులు, మిలిటరీ అధికారులు అత్యంత సమర్థవంతంగా ఛేదించారు.

...మిగతా 2 లో...



# ఢిల్లీలో మోదీ-పుతిన్ 'కార్ డిప్లమసీ'...

- భారత్ మండపంలో ద్వైపాక్షిక చర్చల అనంతరం ప్రయాణం
- మళ్లీ అదే సీన్ ఎందుకంత స్పెషల్?
- మోదీ-పుతిన్ ఒకే కారులో ఇన్నోప్రామ్ ప్రదర్శనకు
- బిష్కెక్‌లోనూ ఒకే కారులో వెళ్లిన ఇద్దరు నేతలు
- టియాంజిన్‌లోనూ ఇదే తరహా దృశ్యం

**పుతిన్‌కు ఢిల్లీలో ఘన స్వాగతం**

భారత్-రష్యా స్నేహబంధానికి మరోసారి ఆసక్తికర దృశ్యం కనిపించింది. ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ఒకే కారులో ప్రయాణించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ద్వైపాక్షిక చర్చలు ముగిసిన వెంటనే ఇద్దరు నేతలు కలిసి ఇన్నోప్రామ్ ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు ఒకే కారులో వెళ్లారు. ...మిగతా 2 లో...



## సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి: రాంచందర్‌రావు

- 25 ఏళ్ల రాజకీయ ప్రస్థానాన్ని పూర్తి చేసుకున్న మోదీ
- సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్న రాంచందర్ రావు
- సెప్టెంబర్ 7న దీపాలు వెలిగించి మోదీకి శుభాకాంక్షలు తెలపాలని పిలుపు

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 25 ఏళ్ల సుదీర్ఘ ప్రజాసేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని తెలంగాణ వ్యాప్తంగా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు నెల రోజుల పాటు 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు వెల్లడించారు.

...మిగతా 2 లో...

### మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై

# కేటీఆర్ సంచలన ఆరోపణలు



- కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించడంపై కేటీఆర్ స్పందన
- సీఎం సోదరుల భూ కుంభకోణాన్ని బయటపెట్టినందుకే సురేఖపై వేటు వేశారని ఆరోపణ
- కాంగ్రెస్ హయాంలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా జరుగుతోందని విమర్శ
- నిషేధిత భూముల జాబితా 16 లక్షల నుంచి కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని వెల్లడి

రాష్ట్ర మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించడం వెనుక భారీ భూ కుంభకోణం దాగి ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరులకు సంబంధించిన భూ అక్రమాలను కొండా సురేఖ కుమార్తె వెలుగులోకి తీసుకువచ్చినందుకే ఆమెపై వేటు పడిందని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో దేశంలోనే అతిపెద్ద భూ కబ్జా పర్వం కొనసాగుతోందని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ...మిగతా 2 లో...



# 22ఏ అనేది పొరపాటు కాదు..

- రేవంత్ రెడ్డి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారన్న హరీశ్
- మంత్రి పొంగులేటి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్
- సామాన్యుల ఆస్తులను 22ఏ నుంచి తొలగించాలన్న హరీశ్

**కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం: హరీశ్ రావు**

తెలంగాణలో నిషేధిత భూముల జాబితా 22ఏ వివాదంపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. 22ఏ జాబితాలో భూములను చేర్చడం కేవలం సాంకేతిక పొరపాటు కాదని, కాంగ్రెస్ ప్రభుత్వం దురుద్దేశంతో చేసిన పెద్ద దుర్మార్గమని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో 22ఏ బాధితులతో బీఆర్ఎస్ నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ...మిగతా 2 లో...



## రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది...

- ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్‌కు సబితా ఇంద్రారెడ్డి ఫిర్యాదు
- బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై విచక్షణారహితంగా దాడి చేశారన్న సబిత
- ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంటుందని వ్యాఖ్య
- తోపులాటలో జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని ఆవేదన

తెలంగాణ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా బీఆర్ఎస్ మహిళా ఎమ్మె ల్యేలపై పోలీసులు విచక్షణారహితంగా దాడి చేశారని ఆరో పిస్తూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఢిల్లీ వేదికగా తీవ్ర నిరసన వ్యక్తం చేశారు.

...మిగతా 2 లో...

### పురపాలక పాలనలో ట్రాన్స్‌జెండర్లు.. అసెంబ్లీలో కీలక

# బిల్లుకు ఆమోదం...

- మున్సిపల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా అవకాశం
- తెలంగాణ మున్సిపాలిటీల చట్ట సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- హైదరాబాద్ వెలుపల 9 కార్పొరేషన్లలో ఒక్కో ట్రాన్స్‌జెండర్‌కు ప్రాతినిధ్యం
- ప్రజా జీవితంలో భాగస్వామ్యం కల్పించడమే లక్ష్యమన్న ప్రభుత్వం
- బిల్లుకు మద్దతు తెలిపిన బీజేపీ, సీపీఐ సభ్యులు



తెలంగాణ ప్రభుత్వం మరో చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని మున్సి పల్ కార్పొరేషన్లలో ట్రాన్స్‌జెండర్లకు కో-ఆప్షన్ సభ్యులుగా ప్రాతినిధ్యం కల్పించే బిల్లుకు శాసనసభ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో పురపాలక పరి పాలనలో, విధాన నిర్ణయాల్లో ట్రాన్స్‌జెండర్ల భాగస్వామ్యానికి మార్గం సుగమమైంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరఫున రాష్ట్ర శాసనసభా వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు 'తెలంగాణ మున్సిపాలిటీల (నాలుగో సవరణ) బిల్లు, 2026'ను సభలో ప్రవేశపెట్టారు. 2019 నాటి తెలంగాణ మున్సిపాలిటీల చట్టానికి ఈ బిల్లు సవరణలు ప్రతిపాదిస్తుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగానే ఈ సంస్కరణలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ బిల్లుకు బీజేపీ, సీపీఐ సహా ఇతర పక్షాల సభ్యులు మద్దతు ప్రకటించగా, అనంతరం సభ దీనిని ఏకగ్రీవంగా ఆమోదించింది.

# ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర...

## - మహిళా అధికారుల ముందు అభ్యంతరకరంగా వ్యవహరించారు: రేవంత్ రెడ్డి...

**శాసనసభ సజావుగా జరగకుండా కేసీఆర్ ఫాంహౌస్‌లోనే కుట్రలు జరిగాయన్న రేవంత్ రెడ్డి ప్రజాప్రతినిధులను, పోలీసులను దూషిస్తూ మూడు రోజులు సభను అడ్డుకున్నారని మండిపాటు బీఆర్ఎస్ కుట్రలను కాంగ్రెస్ ఎమ్మెల్యేలు సమర్థవంతంగా తిప్పికొట్టారని ప్రశంస**

శాసనసభను సజావుగా సాగనివ్వకుండా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన ఆయన ఫాంహౌస్‌లోనే కుట్రలు పన్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. అధికారం పోయినా అహంకారం వీడని బీఆర్ఎస్ నాయకులు పోలీసు అధికారులను, ప్రజాప్రతినిధులను దూషిస్తూ మూడు రోజుల పాటు సభాకార్యక్రమాలను అడ్డుకున్నారని మండిపడ్డారు. ఈరోజు నిర్వహించిన కాంగ్రెస్ శాసనసభా పక్ష (సీఎల్పీ) సమావేశంలో ఎమ్మెల్యేలను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి సుదీర్ఘ ప్రసంగం చేశారు. సభలో అధికారులపై అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, సభాపతిని అత్యంత తీవ్ర పదజాలంతో దూషించారని, మహిళా అధికారుల ముందే టీషర్టులు విప్పి అభ్యంతరకరంగా నిరసన తెలపడం బీఆర్ఎస్ ఎమ్మెల్యేల దిగజారుడుతనానికి నిదర్శనమని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపిన దళితులు నడిచిన నేలను బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేసి దళితులను ఘోరంగా అవమానించారని మండిపడ్డారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నుండి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలన్నింటిపై ప్రభుత్వం తరఫున సమగ్ర విచారణకు ఆదేశించామని వెల్లడించారు. కాంగ్రెస్ అవకాశం ఇవ్వకపోయి ఉంటే వారు రాష్ట్రస్థాయి నాయకులుగా ఎదిగేవారా? అని ప్రశ్నించారు. పోలీస్ సిబ్బందిలో కూడా కేటీఆర్‌కు తన రూపమే కనిపిస్తున్నట్టుందని, అందుకే అధికారులపై అంత ఆక్రోశంతో దాడులకు తెగబడుతున్నారని ఎద్దేవా చేశారు. ...మిగతా 2 లో...



ప్రజావీక్షణం దినపత్రిక


# గల్వాన్ తర్వాత మారుతున్న సీన్..

మొదటిపేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీకి ముందు బీజింగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. భారత్, చైనా మధ్య ఉన్న విభేదాలను పరిష్కరించుకునేందుకు సిద్ధంగా ఉన్నామని చైనా స్పష్టం చేసింది. ఇరు దేశాలు మంచి పొరుగుదేశాలుగా, స్నేహపూర్వకంగా కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు తెలిపింది. భారత్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు సందర్భంగా మోదీ, జిన్‌పింగ్ సమావేశం కానున్నారు. 2019 తర్వాత జిన్‌పింగ్ భారత్‌కు రావడం ఇదే తొలిసారి. దీంతో ఈ భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది. 2020లో తూర్పు లద్దాఖ్‌లోని గల్వాన్ లోయలో ఇరు దేశాల సైనికుల మధ్య ఘర్షణ తర్వాత సంబంధాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2024 అక్టోబర్‌లో భారత్, చైనా సరిహద్దుల్లో గస్తీకి సంబంధించి కీలక ఒప్పందానికి వచ్చాయి. దీంతో ఇరు దేశాల మధ్య సంబంధాలు మళ్లీ క్రమంగా మెరుగుపడుతున్నాయి. గత ఏడాది ఆగస్టులో ప్రధాని మోదీ చైనాలో పర్యటించారు. ఆ తర్వాత ఉన్నతస్థాయి సంప్రదింపులు మరింత పెరిగాయి. చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ మాట్లాడుతూ.. ఇరు దేశాల నేతల మార్గదర్శకత్వంలో వ్యూహాత్మక, దీర్ఘకాలిక దృక్పథంతో సంబంధాలను ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. పరస్పరం సంప్రదింపులు పెంచడం, సహకారాన్ని బలోపేతం చేయడం, విభేదాలను సరిగా నిర్వహించడం తమ లక్ష్యాలని తెలిపారు. మోదీ, జిన్‌పింగ్ వరుసగా మూడో ఏడాది సమావేశం కానున్నారు. గతంలో 2025 ఆగస్టులో చైనాలోని టియాంజిన్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ సదస్సు సందర్భంగా ఇరువురు నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. విమాన సర్వీసులు, వీసాలు, ఉన్నతస్థాయి సంబంధాలు కూడా క్రమంగా పునరుద్ధరించుకుంటున్నాయి. బ్రిక్స్ సహకారాన్ని మరింత బలోపేతం చేసేందుకు అన్ని సభ్య దేశాలతో కలిసి పనిచేస్తామని చైనా తెలిపింది. అంతర్జాతీయ పరిస్థితులు, బ్రిక్స్ భవిష్యత్ అభివృద్ధి, పరస్పర సహకారంపై జిన్‌పింగ్ ఇతర దేశాల నేతలతో చర్చించనున్నారు. బ్రిక్స్‌ను 2009లో ప్రధాన అభివృద్ధి చెందుతున్న దేశాల వేదికగా ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇందులో ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ సహా మరిన్ని దేశాలు ఉన్నాయి.

# ఫాంహౌస్‌లో కేసీఆర్ కుట్ర...

మొదటిపేజీ తరువాయి

పాలనాపరంగా కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల మైలురాయిని పూర్తి చేసుకున్న సందర్భంగా, చేపట్టిన సమగ్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకే ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఎం వివరించారు. చారిత్రక భవనంలో శాసన మండలిని పునఃప్రారంభించుకోవడమే కాకుండా, అసెంబ్లీలోని సెంట్రల్ హాల్‌ను ప్రారంభించి మాజీ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు పేరు పెట్టామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని, కేంద్రం చేపట్టబోయే జనాభా లెక్కల్లోనూ ఈ తెలంగాణ నమూనాను అమలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. ఇదే సమయంలో 'ఎస్ఐఆర్' పేరుతో లక్షలాది ఓట్లను తొలగించే పెద్ద కుట్ర జరుగుతోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో వయోజనుల జనాభా 103 కోట్లుగా ఉంటే, ఓటర్ల జాబితాలో మాత్రం కేవలం 88 కోట్లే చూపిస్తున్నారని, అంటే దాదాపు 15 కోట్ల ఓట్లు గల్లంతయ్యాయని వివరించారు. ఎమ్మెల్యేగా మళ్లీ గెలవాలనుకునే ప్రతీ ఒక్కరూ తమ నియోజకవర్గాల్లో ఓటు హక్కు పరిరక్షణను అత్యంత తీవ్రంగా పరిగణించాలని నిర్దేశించారు. శాసనసభ చర్చల్లో క్రమం తప్పకుండా పాల్గొనాలని, హాజరు శాతాన్ని కాపాడుకుంటూ స్థానిక సమస్యలను సభ దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యేలకు సూచించారు.

# బొల్లారం మద్రాస్ రెజిమెంట్ ఆయుధాల చోరీ.. నలుగురు నిందితుల అరెస్ట్: సీవీ ఆనంద్ సంచలన వివరాలు

మొదటిపేజీ తరువాయి

ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. ఈ కేసుకు సంబంధించి మొత్తం నలుగురు నిందితులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు. చోరీకి గురైన అత్యంత ప్రమాదకరమైన ఆయుధాలు, మ్యాగజైన్లు, బుల్లెట్లు, బైనాక్యులర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు స్పష్టం చేశారు. ఆగస్టు 31న జరిగిన ఈ ఆయుధాల దొంగతనంలో బెల్ ఆఫ్ ఆర్మ్స్ ఇన్ ఛార్జ్, అమ్యునేషన్ సెక్షన్ ఇన్ ఛార్జ్ సహకారం ఉన్నట్లు విచారణలో తేలింది. మొదట బెల్ ఆఫ్ ఆర్మ్స్‌లోకి ప్రత్యక్షంగా ప్రవేశ అర్హత ఉన్న 16 మందిపై దృష్టి సారించిన అధికారులు, సుదీర్ఘ సాంకేతిక విచారణ చేపట్టారు. ఈ క్రమంలో హవాల్దార్లు టి.పి.ఎస్. రావు, మల్లేశ్ అలియాస్ రాజుల ప్రవర్తన అనుమానాస్పదంగా కనిపించడంతో వారిపై నిఘా పెట్టారు. విచారణ సమయంలో మల్లేశ్ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసినప్పటికీ, సాంకేతిక ఆధారాలతో నిలదీయడం, అధికారులు అతడి భార్యకు పరిస్థితి వివరించడంతో అసలు నిజం బయటపడింది. భార్య గట్టిగా ప్రశ్నించడంతో మల్లేశ్ ఆయుధాల దొంగతనం ఒప్పుకున్నాడు. దర్యాప్తు వివరాల ప్రకారం.. నిందితుడు మల్లేశ్ ఆగస్టు 28, 29 తేదీల్లో ఆయుధాగారం వద్ద రెక్కీ నిర్వహించి, రాత్రి వేళల్లో సీసీ కెమెరాలు లేని మార్గాలను గుర్తించాడు. ఆగస్టు 30న కార్గిల్ గేట్ నుంచి లోపలికి వచ్చి పరిస్థితులను గమనించి, 31వ తేదీన పక్కా ప్రణాళికతో ఆయుధాలను చోరీ చేశాడు. ఆర్మీ నుంచి తనను అకారణంగా తొలగించారన్న కోపంతోనే మల్లేశ్ ఈ చర్యకు పాల్పడినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఆయుధాలను చోరీ చేశాక మొదట ఒక చోట పాతిపెట్టి, ఆ తర్వాత మరో ప్రాంతానికి ఎందుకు మార్చాడనే కోణంలో లోతైన విచారణ సాగుతోందని డీజీపీ వివరించారు. ఈ చోరీకి ఎలాంటి అంతర్జాతీయ ముఠాలతో గానీ, ఉగ్రవాద సంస్థలతో గానీ సంబంధాలు ఉన్నట్లు ఇప్పటివరకు ఆధారాలు లభించలేదని డీజీపీ సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. దేశ అంతర్గత భద్రతకు తీవ్ర ముప్పుగా పరిణమించే అవకాశం ఉన్న ఈ ప్రమాదకర ఆయుధాల చోరీని సత్వరమే ఛేదించిన మిలిటరీ అధికారులను, హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌ను, దర్యాప్తు బృందాలను డీజీపీ సీవీ ఆనంద్ ప్రత్యేకంగా ప్రశంసించారు.

# ఢిల్లీలో మోదీ-పుతిన్ 'కార్ డిప్లమసీ'...

మొదటిపేజీ తరువాయి

రెండు దేశాల పరిశ్రమలు, వాణిజ్య శాఖలు కలిసి ఈ ప్రదర్శనను నిర్వహిస్తున్నాయి. మోదీ, పుతిన్ ఒకే కారులో ప్రయాణించడం ఇదే తొలిసారి కాదు. ఆగస్టు 31న కిర్గిస్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీవో) సదస్సు సందర్భంగా కూడా ఇద్దరూ ఒకే కారులో ప్రయాణించారు. ద్వైపాక్షిక చర్చల తర్వాత ప్రపంచ నోమాడ్ గేమ్స్ ప్రారంభోత్సవానికి కలిసి వెళ్లారు.గత ఏడాది చైనాలోని టియాంజిన్‌లో జరిగిన ఎస్‌సీవో సదస్సు సమయంలోనూ మోదీ, పుతిన్ ఒకే కారులో ద్వైపాక్షిక భేటీ వేదికకు వెళ్లారు. దీంతో ఈ విధానాన్ని విశ్లేషకులు 'మోదీ కార్ డిప్లమసీ'గా అభివర్ణిస్తున్నారు. సోషల్ మీడియాలోనూ ఈ దృశ్యాలు పెద్ద చర్చకు దారితీశాయి. ఢిల్లీలో జరిగిన భేటీలో మోదీ.. పుతిన్‌కు రష్యన్ భాషలోకి అనువదించిన 'తిరుక్కురళ్' పుస్తకాన్ని బహుమతిగా ఇచ్చారు. తమిళ కవి, తత్వవేత్త తిరువళ్లువర్ రచించిన ఈ గ్రంథంలో 1,330 కురళ్లు ఉన్నాయి. నీతి, సంపద, ప్రేమ వంటి అంశాలపై ఇందులో బోధనలు ఉన్నాయి. ఈ పుస్తకాన్ని రష్యన్‌లోకి అనువదించారు. భేటీకి ముందు మోదీ, పుతిన్ ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఈ ఏడాదిలో ఇద్దరు నేతలు కలుసుకోవడం ఇది రెండోసారి. ఆగస్టు 31న బిష్కెక్‌లో జరిగిన ఎస్‌సీవో సదస్సు సందర్భంగా తొలిసారి భేటీ అయ్యారు. 18వ బ్రిక్స్ సదస్సు నేపథ్యంలో పుతిన్ శుక్రవారం ఢిల్లీకి చేరుకున్నారు. విమానాశ్రయంలో కేంద్ర విదేశాంగ శాఖ సహాయ మంత్రి కీర్తి వర్ధన్ సింగ్ ఆయనకు స్వాగతం పలికారు. సెప్టెంబర్ 12, 13 తేదీల్లో భారత్ మండపంలో బ్రిక్స్ సదస్సు జరగనుంది. భారత్ బ్రిక్స్ అధ్యక్షతకు 'బిల్డింగ్ ఫర్ రెసిలియెన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ' అనే థీమ్‌ను ఎంచుకుంది.

# మంత్రి పదవి నుంచి కొండా సురేఖ తొలగింపుపై
## కేటీఆర్ సంచలన ఆరోపణలు

మొదటిపేజీ తరువాయి

శుక్రవారం తెలంగాణ భవన్‌లో '22ఏ' నిషేధిత భూముల బాధితులతో జరిగిన సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు. మంచిర్యాలలో మొదలైన ఈ భూ కుంభకోణం వ్యవహారం ముదరడంతో, దానిని కప్పిపుచ్చేందుకు కొండా సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించారని ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16 లక్షల ఎకరాలుగా ఉన్న 22ఏ నిషేధిత భూముల జాబితా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలకు పెరిగిందని కేటీఆర్ వివరించారు. రాష్ట్రంలో జరుగుతున్న భూదందాకు ఇదే నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. ఒక మంత్రి కుమార్తె ప్రభుత్వంలోని అవినీతిని ప్రశ్నిస్తే, ఏకంగా ఆ మంత్రినే పదవి నుంచి తొలగించడం దారుణమని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ ఉదంతం కాంగ్రెస్ పాలనలో పారదర్శకత ఎంతలా లోపించిందో తేటతెల్లం చేస్తోందని ఆయన విమర్శించారు.

# 22ఏ అనేది పొరపాటు కాదు..
## కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన దుర్మార్గం: హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి

కాంగ్రెస్ ప్రభుత్వం 'భూ భారతి' పేరుతో ప్రజల భూములకు 'భూ హారతి' పడుతోందని ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి భూములను కాజేయడమే పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 30 వేల ఎకరాల పాలిటెక్నిక్ కళాశాలల భూములపై కన్నేశారని హరీశ్ రావు ఆరోపించారు. భూ సమస్యల పరిష్కారానికి ఫోన్ చేస్తే చాలని ప్రచారం చేసుకున్నారని, కానీ నేరుగా వెళ్లి రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసినా బాధితులకు ఎలాంటి పరిష్కారం దొరకడం లేదని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్న ప్రభుత్వం... బడా బాబులు నిర్మించిన అక్రమ నివాసాల జోలికి మాత్రం వెళ్లడం లేదని విమర్శించారు. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ఏమాత్రం నైతిక బాధ్యత ఉన్నా వెంటనే తన మంత్రి పదవికి రాజీనామా చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. 2ఏ నిషేధిత జాబితా నుంచి ముఖ్యమంత్రి నివాసాన్ని తొలగించినప్పుడు, అదే జాబితాలో ఉన్న సామాన్య ప్రజల నివాసాలను, భూములను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. తక్షణమే పేదల, సామాన్యుల ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ముందుండి పోరాటం చేస్తుందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

# సెప్టెంబర్ 17న ప్రతి ఇంటా దీపాలు వెలిగించాలి: రాంచందర్‌రావు

మొదటిపేజీ తరువాయి

ప్రజలకు సేవ చేయడం ద్వారా మరింత చేరువ కావడం, అలాగే పార్టీ కార్యకర్తల్లో సేవా భావాన్ని పెంపొందించడమే ఈ అభియాన్ ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. అభియాన్ ఆరంభ రోజైన సెప్టెంబర్ 17న 'ఆశీర్వాద్ కా దియా' పేరిట రాష్ట్రంలోని ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి ప్రధానమంత్రికి శుభాకాంక్షలు తెలియజేయాలని రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు, ప్రజలకు పిలుపునిచ్చారు. నెల రోజుల పాటు సాగే ఈ ఉత్సవాల్లో భాగంగా రక్తదాన శిబిరాలు, స్వచ్ఛ భారత్ కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు, వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు వివరించారు. మోదీ పాలనలో జన్‌ధన్ యోజన, డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా పేదలను నేరుగా బ్యాంకింగ్ వ్యవస్థతో అనుసంధానించి సంక్షేమ ఫలాలను పూర్తి పారదర్శకంగా అందిస్తున్నామని ఆయన తెలిపారు. యూపీఐ, డిజిటల్ చెల్లింపుల విప్లవంతో భారత్ ప్రపంచ డిజిటల్ పేమెంట్ రంగంలో అగ్రగామిగా నిలిచిందన్నారు. పీఎం విశ్వకర్మ, పీఎం స్వనిధి, ముద్ర రుణాల ద్వారా చేతివృత్తిదారులు, వీధి వ్యాపారులు, చిన్న వ్యాపారులకు ఆర్థిక చేయూతనిస్తున్నామని గుర్తుచేశారు. ఈ క్రమంలోనే 'మేరే సప్నో కా భారత్', 'సేవా కీ కహానీ', 'సేవా జ్యోతి కలశ్ యాత్ర', 'సుశాసన్ సేవా సంవాద్' వంటి పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ, మోదీ పథకాలను ప్రతి ఇంటికీ చేరవేస్తామని పేర్కొన్నారు.

# సీపీ అంబర్ కిషోర్ ఝా ని కలిసిన మంథని మున్సిపల్ చైర్మన్ వొడ్నాల శ్రీనివాస్

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం, సెప్టెంబర్ 11:**

రామగుండం పోలీస్ కమిషనర్ (సీపీ) అంబర్ కిషోర్ ఝా ను శుక్రవారం మంథని మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సిపిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంథని మున్సిపల్ పరిధిలోని పలు సమస్యలు, ప్రజలకు సంబంధించిన అంశాలపై సీపీ అంబర్ కిషోర్ ఝా తో ఆయన చర్చించారు. అలాగే మంథని పట్టణంలో నిర్వహించనున్న గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గణపతి ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సిపి ని చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ కోరారు.




# నేడు మంథనిలో మిషన్ భగీరథ మంచినీటి సరఫరాలో అంతరాయం

**-మంథని మున్సిపల్ కమిషనర్ మనోహర్**

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం, సెప్టెంబర్ 11:**

మంథని మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో మిషన్ భగీరథ మంచినీటి సరఫ రాలో శనివారం ఉదయం అంత రాయం ఉంటుందని మంథని మున్సిపల్ కమిషనర్ ఎన్ మనోహర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం,శనివారం ఉదయం సాంకేతిక సమస్య కారణంగా మిషన్ భగీరథ మంచినీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన తెలిపారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించుకొని, మున్సిపాలిటీకి సహకరించగలరని మున్సిపల్ కమిషనర్ మనోహర్ కోరారు.

# గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ లక్ష్యం

**-మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్**

**-ఎస్‌జీఎఫ్ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతుల ప్రధానం**

**మంథని ప్రతినిధి, ప్రజా వీక్షణం, సెప్టెంబర్ 11:**

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంథని పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల క్రీడా మైదానం లో ఈ నెల 8న మంథని రూరల్, మంథని అర్బన్, ముత్తారం, రామగిరి ఎస్‌జీఎఫ్ జోనల్ లెవల్ స్పోర్ట్స్ మీట్‌ను ఘనంగా ప్రారంబించగా, క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతులను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి సరైన అవకాశాలు కల్పించి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం – క్రీడల ద్వారా ప్రతిభకు ప్రోత్సాహం అనే లక్ష్యంతో క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని, క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఈ పోటీల ద్వారా ప్రతిభను కనబరిచిన క్రీడాకారులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. క్రీడా పోటీలను విజయవంతంగా నిర్వహించిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, నిర్వాహకులను ఈ సందర్భంగా కొత్త శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, ఆర్ టిఐ మెంబర్ మంథని సురేష్, పీఈటి దొమ్మటి రవి, పిడి కొమురోజు శ్రీనివాస్, వివిధ పాటశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ డైరెక్షన్‌లోనే అంతా జరిగింది...

మొదటిపేజీ తరువాయి

ఈ తోపులాటలోనే మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి కిందపడిపోయారని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యక్ష ఆదేశాలతోనే పోలీసు బలగాలు తమపై ఈ స్థాయిలో విరుచుకుపడ్డాయని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. శాసనసభ లోపలైనా ఈ దాడిపై ప్రభుత్వం చర్చ జరుపుతుందని, సీఎం లేదా హోంమంత్రి బాధ్యత వహించి మాట్లాడతారని భావించామని, కానీ దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపైనే ఎదురు కేసులు బనాయించారని సబిత ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళా ఎమ్మెల్యేలను లైంగికంగా వేధించారంటూ అసత్య ఫిర్యాదులు చేయించడం, కేసీఆర్ నివాసం వద్దకు నిరసనకారులను పంపడం వంటివన్నీ సీఎం రేవంత్ రెడ్డి డైరెక్షన్‌లోనే జరిగాయని ఆరోపించారు. రాష్ట్రంలో న్యాయం జరగకపోవడం వల్లే తాము ఢిల్లీకి వచ్చి జాతీయ కమిషన్లను ఆశ్రయించాల్సి వచ్చిందని, ఇది తెలంగాణ ప్రభుత్వానికి సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. వంద రోజుల్లో ఇస్తామన్న హామీలను నెరవేర్చడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రశ్నిస్తున్న ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు మహిళా కానిస్టేబుళ్లను అడ్డుపెట్టుకుని 'శిఖండి రాజకీయాలు' చేస్తోందని ధ్వజమెత్తారు.

# సంపాదకీయం

## మొహం చాటేసిన వర్షాలు...!

ఈ ఏడాది ఇప్పటివరకు వర్షాభావ పరిస్థితులే ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో అక్కడక్కడ చెదురుముదురు వర్షాలు మినహా ఎక్కడా అనుకున్న స్థాయిలో వర్షాలు కురవలేదు. మరోవైపు వర్షాకాలం చివరికి వస్తున్న కొద్దీ దేశంలోని రైతన్నల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. వాతావరణ శాఖ వెల్లడించిన తాజా అంచనాల ప్రకారం.. సెప్టెంబర్ మూడో వారం నుంచి దేశవ్యాప్తంగా పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. దీనికి తోడు పసిఫిక్ మహాసముద్రంలో బలపడుతున్న 'ఎల్ నినో' ప్రభావం రబీ పంటల సాగుపై తీవ్ర ముప్పుగా పరిణమించేలా ఉంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, బీహార్ వంటి పలు రాష్ట్రాల్లో సాధారణం కంటే 27 నుంచి 45 శాతం వరకు తక్కువ వర్షపాతం నమోదైంది. వర్షాకాలం ముగిసే సమయానికి వర్షాలు మొహం చాటేస్తే.. వచ్చే శీతాకాలంలో వేసే రబీ పంటల పరిస్థితి ఏంటనేది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. సాధారణంగా రబీ సీజన్ అక్టోబర్ నుంచి ప్రారంభమవుతుంది. సెప్టెంబర్‌లో వర్షాలు పడకపోయినా విత్తనాలు వేసే సమయం మారకపోవచ్చు కానీ, నేలలో తేమ శాతం దారుణంగా పడిపోతుంది. ప్రస్తుతం దేశంలోని 178 ప్రధాన రిజర్వాయర్లలో నీటి నిల్వలు గత ఏడాదితో పోలిస్తే దాదాపు 20 శాతం తగ్గిపోయాయి. గతేడాది ఇదే సమయానికి 163.44 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు ఉండగా, ఇప్పుడు అది 130.55 బిలియన్ క్యూబిక్ మీటర్లకు పరిమితమైంది. పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ , మధ్యప్రదేశ్ వంటి వ్యవసాయ ఆధారిత రాష్ట్రాల్లో నీటి నిల్వలు లేకపోతే విత్తనాలు మొలకెత్తడమే కష్టమవుతుంది. భారతీయ వ్యవసాయంలో రబీ కాలం చాలా కీలకమైనది. ముఖ్యంగా నీటి లభ్యత , నేలలోని తేమపై ఆధారపడే గోధుమ, ఆవాలు, శనగ పంటలు ఈసారి తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, హర్యానా రాష్ట్రాల్లో గోధుమలు, ఆవాల సాగు ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ మొదటి తడికి రిజర్వాయర్ నీళ్లే ఆధారం. మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లోని నల్లరేగడి నేలల్లో వేసే శనగ పంట కేవలం భూమిలోని తేమ ఆధారంగానే పెరుగుతుంది. వర్షాలు లేక భూమి ఎండిపోతే ఈ పంటల దిగుబడి దారుణంగా పడిపోతుంది. ఎల్ నినో వల్ల ఏర్పడే కరవు పరిస్థితులను అధిగమించడానికి 'ఇండియన్ ఓషన్ డైపోల్' కాస్త ఆశాకిరణంగా కనిపిస్తోందని నిపుణులు చెప్తున్నారు. హిందూ మహాసముద్రంలో ఏర్పడే ఈ సానుకూల మార్పు వల్ల భారత్ వైపు వర్షపు మేఘాలు తొలకరిచ్చే అవకాశం ఉంది. 1997, 2023 సంవత్సరాల్లో ఎల్ నినో తీవ్రతను ఈ ఐఓడీ కొంతవరకు తగ్గించగలిగింది. అయితే, ఇది ప్రధానంగా వర్షాకాలానికే పరిమితమవుతుంది కాబట్టి, ఎండిపోయిన భూగర్భ జలాలను, ఖాళీ అయిన రిజర్వాయర్లను ఎంతవరకు నింపుతుందనేది అనుమానంగానే ఉంది. ఒకవేళ అక్టోబర్, నవంబర్ నెలల్లో భూమిలో తేమ శాతం పెరగకపోతే రబీ పంటల విస్తీర్ణం తగ్గడమే కాకుండా దిగుబడులు కూడా దెబ్బతింటాయి. దీనివల్ల రాబోయే రోజుల్లో గోధుమలు, పప్పుధాన్యాలు, వంటనూనెల సరఫరా తగ్గి, నిత్యావసర ధరలు మళ్లీ ఆకాశాన్ని తాకే ప్రమాదం ఉందని ఆర్థిక విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఇది కేవలం రైతుల ఆదాయాన్నే కాకుండా, సామాన్య ప్రజల జేబులకు కూడా పెద్ద కన్నం వేసేలా కనిపిస్తోంది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా కరవు తాండవిస్తోంది. ఓవైపు వర్షాధార పంటల సాగును చాలా వరకు తగ్గించినప్పటికీ మరోవైపు బోర్లు, బావులపై ఆధారపడి సాగు చేసిన వరి సైతం చేతికందేలా లేదు. భూగర్భజలాలు దారుణంగా పడిపోయి, బోర్లు వట్టిపోతున్నాయి. ఎండిపోతున్న పంటలను చూడలేక అన్నదాతలు బావుల్లో పూడిక తీయిస్తూ కొత్త బోర్లు వేయిస్తున్నా చుక్క నీరు పడటం లేదు. ఈ వర్షాభావ పరిస్థితులు మరో వారం, పదిరోజుల పాటు కొనసాగితే పంటలపై ఆశలు వదిలేసుకోవాల్సిందేనని రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో సాధారణంగా 1.32 కోట్ల ఎకరాల విస్తీర్ణంలో సాగు నమోదయ్యేది. కానీ ఈ ఏడాది 1.21 కోట్ల ఎకరాలు అంటే సుమారు 92 శాతం మేరకే సాగు చేసినట్లు వ్యవసాయశాఖ గణాంకాలు నివేదిస్తున్నాయి. ప్రధానంగా 66 లక్షల ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు నమోదవుతుండగా ఈసారి 52.81 లక్షల ఎకరాల్లో(80 శాతం) మాత్రమే నాట్లు పడ్డాయి. ఇక పత్తి అంచనా సాగు 47 లక్షల ఎకరాలకు గాను 48 లక్షల ఎకరాల్లో సాగు నమోదైంది. 6.49 లక్షల ఎకరాల విస్తీర్ణంలో అపరాలు సాగవుతుండగా 7.86 లక్షల ఎకరాలకు చేరింది. అధికంగా నీటి ఆధారమైన వరి సాగు 20 శాతం వరకు తగ్గింది. కానీ చాలా ప్రాంతాల్లో నాట్లు వేసిన రైతులు మాత్రం పంటను కాపాడుకోడానికి ఎన్నో పాట్లు పడుతున్నారు.రాష్ట్రంలో ఈ సీజన్?కు సంబంధించి ఇప్పటిదాకా 49 రోజులే వర్షం కురిసింది. 598.9 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి గాను 478.2 మి.మీ మాత్రమే కురిసింది. మొత్తంగా 20 శాతం లోటు వర్షపాతం ఏర్పడగా 15 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. తక్కిన 18 జిల్లాల్లో లోటు వర్షపాతమే కొనసాగుతోంది. జనగామ, వరంగల్, హనుమకొండ, భద్రాద్రి కొత్తగూడెం, జోగులాంబ గద్వాల, సూర్యాపేట, ఖమ్మం, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో దాదాపు 40 శాతం లోటులో కొనసాగుతుండటం గమనార్హం. గతేడాదితో పోలిస్తే రాష్ట్రంలో భూగర్భ జలమట్టం దాదాపు 2 మీటర్లకు పైగా పడిపోయింది. గత సంవత్సరం ఆగస్టు చివరి నాటికి 5.78 మీటర్ల లోతులో ఉన్న నీటిమట్టం ఇప్పుడు 7.87 మీటర్లకు పడిపోవడం గమనార్హం. జిల్లాల వారీగా చూస్తే సూర్యాపేట, వికారాబాద్ జిల్లాల్లో గతంతో పోలిస్తే అదనంగా 5 మీటర్ల మేర నీటిమట్టం తగ్గింది. నారాయణపేట, మహబూబ్‌నగర్, మేడ్చల్ జిల్లాల్లో 4 మీటర్లు, అలాగే వరంగల్, సంగారెడ్డి, రంగారెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో 3 మీటర్లకు లోతులోకి నీటిమట్టాలు పడిపోయాయి. వర్షాలు కురవక, సాగునీరు లేక అన్నదాతలు అష్టకష్టాలు ఎదుర్కొంటున్నారు. చెరువుల్లో నీటిని బయటకు తోడేందుకు మోటార్లను ఏర్పాటు చేసుకున్నారు. వనపర్తి జిల్లా, వీపనగండ్ల మండలంలోని పుల్గర్ల గ్రామంలో ఉన్న కొత్త చెరువు పరిధిలో 50 ఎకరాలకు పైగా ఆయకట్టు సాగయ్యేది. నీటి వసతి ఉన్న కొందరు రైతులు అక్కడక్కడా సుమారు ఐదు ఎకరాల వరకు వరి సాగు చేశారు. మిగిలిన పొలాలు మాత్రం బీళ్లుగా ఉండిపోయాయి. ఆయకట్టు చివరన ఉన్న పంటలకు నీరందించేందుకు చెరువులో ఉన్న కొద్దిపాటి నీటిని తోడేందుకు రైతులు మోటార్లను ఏర్పాటు చేశారు. ఇలాంటి పరిస్థితులే మున్ముందు కొనసాగితే సాగు నీటికే కాదు తాగునీటికి కూడా ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# కుక్కునూరు మండలంలో ఉపాధ్యాయుడి సస్పెన్షన్ హర్షణీయం: సిఐటియు

స్వీపర్ పట్ల అనుచిత ప్రవర్తన.. నాడు సిఐటియు ఆధ్వర్యంలో పెద్దఎత్తున ధర్నాలు!

ఎంఈఓ ప్రాథమిక విచారణలో వెలుగుచూసిన విస్తుపోయే నిజాలు!

విద్యార్థులను చెప్పులతో కొడుతూ.. అత్యంత అభ్యంతరకర భాష వాడకం!

సస్పెన్షన్‌తో సరిపెట్టవద్దు.. ఆ మండలంలో తిరిగి పోస్టింగ్ ఇవ్వొద్దని సిఐటియు వార్నింగ్!

**కుక్కునూరు, సెప్టెంబర్ 11:( ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ, విద్యార్థులు, సిబ్బంది పట్ల అత్యంత బాధ్యతారహితంగా వ్యవహరించిన ఉపాధ్యాయుడు దుత్త రాంప్రసాద్‌పై జిల్లా విద్యాశాఖాధికారి సస్పెన్షన్ వేటు వేయడాన్ని సిఐటియు తీవ్రంగా స్వాగతించింది. శుక్రవారం నాడు సుందరయ్య భవనం ప్రజాసంఘాల కార్యాలయం నుండి సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ మాట్లాడుతూ పాఠశాల పవిత్రతను కాపాడాల్సిన కొందరు ఉపాధ్యాయులు తమ ప్రవర్తనతో విద్యారంగానికి మచ్చ తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సస్పెన్షన్‌తో సరిపెట్టకుండా, సదరు ఉపాధ్యాయుడికి కుక్కునూరు మండలంలో ఎలాంటి పరిస్థితుల్లోనూ తిరిగి పోస్టింగ్ ఇవ్వకూడదని ఆయన డిమాండ్ చేశారు.గతంలో ఇబ్రహీంపేట పాఠశాలలో పనిచేస్తున్న సమయంలో స్వీపర్ కాకర్ల వెంకటేశ్వరమ్మపై ఉపాధ్యాయుడు రాంప్రసాద్ అనుచితంగా ప్రవర్తించడమే కాకుండా, దుర్భాషలాడారని సాయికిరణ్ గుర్తుచేశారు. ఈ ఘటనపై అప్పట్లోనే సిఐటియు ఆధ్వర్యంలో ఎం.ఈ.ఓ మరియు తహాశీల్దార్ కార్యాలయాల ఎదుట పెద్దఎత్తున ధర్నాలు నిర్వహించి, అధికారులకు వినతిపత్రాలు అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో సదరు ఉపాధ్యాయుడిని వర్క్ అడ్జస్ట్‌మెంట్‌పై బంజరగూడెం పాఠశాలకు బదిలీ చేసినప్పటికీ ఆయన తీరు మారలేదని సిఐటియు ఆరోపించింది. అక్కడ కూడా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు మరియు పాఠశాల కమిటీ సభ్యుల నుంచి ఆయన అనుచిత ప్రవర్తనపై తీవ్రస్థిలో ఫిర్యాదులు వెల్లువెత్తినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారని తెలిపారు. సెప్టెంబర్ 8న మండల విద్యాధికారి నిర్వహించిన ప్రాథమిక విచారణలో ఉపాధ్యాయుడి అరాచకాలు ఒక్కొక్కటిగా బయటపడ్డాయి. విచారణ నివేదిక ఆధారంగా జిల్లా విద్యాశాఖాధికారి సెప్టెంబర్ 9న సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు. నిరుపేద విద్యార్థులను చెప్పులతో కొట్టడం, పాఠశాలలో అత్యంత అభ్యంతరకరమైన, బూతు భాషను ఉపయోగించడం, పాఠశాలలోని బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించడం వంటి తీవ్ర ఆరోపణలు విచారణలో నమోదైనట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారని తెలిపారు. గతంలో కూడా ఈ ఉపాధ్యాయుడికి అధికారుల నుంచి పలుమార్లు నోటీసులు,



హెచ్చరికలు జారీ అయినట్లు పేర్కొన్న నేపథ్యంలో, ఈసారి విచారణను వేగంగా పూర్తి చేసి నిబంధనల ప్రకారం తగిన తుది చర్యలు తీసుకోవాలని కోరారు.ఆలస్యమైనా ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ చర్యలు తీసుకున్నందుకు అధికారులకు సిఐటియు తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని సాయికిరణ్ అన్నారు. అయితే సస్పెన్షన్‌తోనే చర్యలు ముగియకుండా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు కఠినంగా వ్యవహరించాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థుల భద్రత, మహిళా సిబ్బంది గౌరవం, కార్మికుల హక్కులను కాపాడేందుకు ఫిర్యాదులపై తక్షణమే స్పందించాల్సిన అవసరం ఉందన్నారు. సస్పెండ్ అయిన ఉపాధ్యాయుడికి కుక్కునూరు మండలంలో తిరిగి పోస్టింగ్ ఇవ్వకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సిఐటియు గట్టిగా డిమాండ్ చేస్తోందని యర్నం సాయికిరణ్ పేర్కొన్నారు.

# శ్రీ చైతన్య లో ముందస్తు వినాయక చవితి వేడుకలు

**తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం)**

తాడేపల్లిగూడెం హౌసింగ్ బోర్డ్ లోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు శుక్రవారం ముందస్తుగా వినాయక చవితి పూజలు నిర్వహించారు. వివిధ వేషాలలో వినాయకులు గా చిన్నారులు అలంకరించుకొని పూజాది కార్యక్రమంలో పాల్గొన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సింగలూరి దుర్గాప్రసాద్ విద్యార్థులకు ఆశీస్సులు అందిస్తూ వినాయక చవితి యొక్క విశిష్టతను, పూజాది కార్యక్రమాలను వివరించారు. చిన్నారులు ఇంటి వద్ద సైతం మట్టితో తయారు చేసిన విగ్రహాలమే పూజించాలని ఫలితంగా పర్యావరణ పరిరక్షణకు నాంది పలికిన వారుగా నిలు స్తారని దుర్గాప్రసాద్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ సూర్య నారాయణమూర్తి, ఏవో గంగరాజు, ప్రైమరీ ఇన్చార్జ్ రజిని ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# టి. నర్సాపురం మండలం గండిమెట్ట లో ఉద్రిక్తత

## సర్వే నెం. 767 భూముల్లో సోలార్ ప్లాంట్ ఏర్పాటును నిలిపివేయాలి

## ఎమ్మార్వో కార్యాలయం వద్ద భారీ ధర్నా - తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత

**టి. నరసాపురం, సెప్టెంబర్ 11:(ప్రజా వీక్షణం)**

ఏలూరు జిల్లా టి. నరసాపురం మండల కేంద్రంలోని తహసీల్దార్ (ఎమ్మార్వో ) కార్యాలయం వద్ద శుక్రవారం నాడు బాధితులు, వ్యవసాయ కార్మిక సంఘం సభ్యులు భారీ ధర్నా నిర్వహించారు. గండిమెట్ట పరిధిలోని సర్వే నెంబర్ 767లో పేదలు సాగు చేసుకుంటున్న మరియు నివాసముంటున్న భూములలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు పనులను తక్షణమే నిలిపివేయాలని కోరుతూ ఈ నిరసన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి తడిగదప జయరాజు ఆధ్వర్యంలో సుమారు 50 మంది బాధితులు, సంఘ సభ్యులు కలిసి ర్యాలీగా వచ్చి ఎమ్మార్వో కార్యాలయాన్ని ముట్టడించి, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. 30 ఏళ్ల క్రితం పోరాటంతో సాధించుకున్న భూములు: ఏ సెంట్ భూమి కూడా లేని నిరుపేద కుటుంబాలు, వ్యవసాయ కార్మికులు గత 30 సంవత్సరాలుగా గండిమెట్ట సమీపంలోని ఈ సర్వే నెంబర్ 767 భూమిని నమ్ముకుని జీవిస్తున్నారు. గతంలో కార్మిక సంఘాల పక్షాన పోరాడి ఈ బంజరు భూములను చదును చేసుకుని, మొక్కలు నాటుకుని ఎకరం, ఎకరంన్నర చొప్పున సాగులోకి తెచ్చుకున్నారు. ప్రస్తుతం సుమారు 60 నుండి 70 మంది రైతులు ఇక్కడ సాగుదారులుగా ఉండగా, దాదాపు 30 నుండి 40 నిరుపేద కుటుంబాలు ఇక్కడే గుడిసెలు వేసుకుని దశాబ్దాలుగా నివాసం ఉంటున్నాయి.

**అధికారిక గుర్తింపు ఉన్నా..**

ముందస్తు నోటీసులు లేకుండానే మిషన్లతో పనులు: గతంలో ఈ పేదల పరిస్థితిని



గమనించిన ప్రభుత్వం, వీరికి ఎల్.టి పట్టాలు, పన్ను రశీదులు మంజూరు చేసింది. ఆ స్థలంలో నివసిస్తున్న పేదలకు ప్రభుత్వమే విద్యుత్ సౌకర్యాన్ని కూడా కల్పించింది. ఇన్ని అధికారిక ఆధారాలు ఉన్నప్పటికీ, ప్రస్తుతం ప్రభుత్వం ఈ భూములలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెబుతూ, ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా పనులు ప్రారంభించింది. సాగుదారులకు ఎలాంటి సమాచారం చెప్పకుండానే రాత్రికి రాత్రే చెట్లను తొలగించేందుకు మిషన్లను దించి పనులు ప్రారంభించడం పట్ల గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బాధితుల ప్రధాన డిమాండ్లు:**

దశాబ్దాలుగా నమ్ముకున్న జీవనాధారాన్ని, తలదాచుకుంటున్న నివాసాలను లాక్కోవడం దారుణమని, పేద ప్రజలను తమ నివాస స్థలాల నుంచి ఖాళీ చేయించి సోలార్ ప్లాంట్ నిర్మించడం అత్యంత అన్యాయమని ధర్నాలో వారు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ఈ ప్రాజెక్ట్ నిర్మాణాత్మక పనులను నిలిపివేసి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబాలకు ఉన్నత రీతిలో అన్ని విధాలా సహాయ సహకారాలు అందించడంతో పాటు, వారు సాగు చేసుకుంటున్న, నివసిస్తున్న స్థలాలకు తక్షణమే శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని అధికారులను కోరారు.

GENERAL NEWS
12 శనివారం సెప్టెంబర్ 2026
4
www.prajaveekshanam.in
ప్రజావీక్షణం
దినపత్రిక

# విద్యార్థులకు డ్రెస్సులు పంపిణీ..

దేవరకద్ర సెప్టెంబర్ 11 ప్రజావిక్షణం



మండల పరిధిలోని నార్లోని కుంట్ల గ్రామంలో పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు సర్పంచ్ అలాగే పాఠ శాల హెచ్ఎం శంకర్, డ్రస్సు లు పంపిణీ చేశారు. విద్యార్థులు సద్వని యోగం చేసుకోవాలని వారు కోరారు.

# దేవరకద్ర నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ కారిడార్‌ను ఏర్పాటు చేయాలి..

## అసెంబ్లీలో మాట్లాడిన ఎమ్మెల్యే జిఎంఆర్..

దేవరకద్ర సెప్టెంబర్ 11 ప్రజావిక్షణం



బ్రహ్మోస్ ఏర్పాటుతో యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తా యని శుక్రవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, అన్నారు, ఎమ్మె ల్యే జియంఆర్ మాట్లాడుతూ .తెలం గాణలో పెట్టుబడులను ఆకర్షి స్తూ భారీ పరిశ్రమలు, డేటా సెంటర్ల ను తీసుకురావడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు, రాష్ట్ర యువత భవిష్యత్తుకు బలమైన పునాదులు వేయాలనే లక్ష్యంతో 70 వేల కోట్లతో డేటా సెంటర్, భారీ పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురా వడం అభినందనీయమన్నారు.దేవరకద్ర నియోజకవర్గం లో హైదరాబాద్ టు బెంగళూరు జాతీయ రహదారి ఎన్ హెచ్-44 సుమారు 68 కిలోమీటర్ల మేర అనుసంధానమై ఉందని తెలిపారు, హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి కూడా నియోజకవర్గం సమీపంలోనే ఉందని, జాతీయ రహదారి, ప్రభుత్వ భూముల లభ్యత వంటి అనుకూలతలు ఉన్నందున ఈ ప్రాంతాన్ని ఇండస్ట్రియల్ కారిడార్‌గా ప్రకటించాలని ముఖ్యమంత్రి గారిని, పరిశ్రమల శాఖ మంత్రి దృష్టికి ఇప్పటికే తీసుకెళ్లినట్లు, తమరి ( శాసనసభ) ద్వారా మరోసారి మంత్రి దృష్టికి తీసుకెళు న్నామని తెలియజేశారు.దేవరకద్ర నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపనకు అనుకూల వాతావరణం ఉన్నందున ఇండస్ట్రియల్ కారిడార్‌గా అభివృద్ధి చేస్తే పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడంతో పాటు స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.అదేవిధంగా దేవరకద్ర నియోజకవర్గంలో బ్రహ్మోస్ ప్రాజెక్టు ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారని ఎమ్మెల్యే తెలిపారు. సుమారు 415 ఎకరాల భూమిని ఉచితంగా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి ఇప్పటికే సుముఖత వ్యక్తం చేశారని అన్నారు, ఈ ప్రాజెక్టు నియోజకవర్గానికి రావడానికి తీవ్రంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,కి ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.దేవరకద్ర నియోజకవర్గం రెండు జాతీయ రహదారులకు అనుసంధానం ఉండటంతో పాటు మూడు రాష్ట్రాలకు అనుకూలమైన భౌగోళిక ప్రాంతంలో నియోజకవర్గం ఉందని, కావున డ్రైపోర్టు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు, ఇక్కడ డ్రైపోర్టు ఏర్పాటు చేస్తే పారిశ్రామిక అభివృద్ధికి ఊతం లభించడంతో పాటు యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని అన్నారు. తెలంగాణను ఐటీ, పారిశ్రామిక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి . రేవంత్ రెడ్డి , ఐటీ శాఖ మంత్రి . శ్రీధర్ బాబు, కృషి చేస్తున్న సమయంలో పెట్టుబడి దారులను భయపెట్టేలా లేదా నిరుత్సాహపరిచేలా ఫ్యూచర్ లేని బీఆర్ఎస్ నాయకులు వ్యవహరించడం సరికాదని పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు రావడం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.తెలంగాణను ఐటీ, పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దే ప్రభుత్వ ప్రయత్నాలకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే జియంఆర్ విజ్ఞప్తి చేశారు.

# పేద మహిళకు బియ్యం సాయం

కర్లపాలెం : సెప్టెంబర్ 11 ( ప్రజా వీక్షణం )

కర్లపాలెం అబ్దుల్ కలాం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కర్లపాలెం పంచాయతీ ఎం వి రాజుపాలెంకు చెందిన ఒక నిరుపేద మహిళకు ఫౌండేషన్ ప్రెసిడెంట్ పఠాన్ అహ్మద్ బాష 10 కేజీల బియ్యంను అందజేశారు.ఈ సందర్భంగా కర్లపాలెం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ ఇన కొల్లు పోలీసురావు మాట్లాడుతూ అబ్దుల్ కలాం ఫౌండేషన్ సేవలు అభినందనీయమని అన్నారు. ఆశించకుండా సేవ చేస్తున్న ఫౌండేషన్ వారిని అభినందించారు.ఈ సందర్భంగా పఠాన్ అహ్మద్ బాష మాట్లాడుతూ పేదలకు ప్రతి శుక్రవారం బియ్యం,నిత్యావసర సరుకులు ,దుప్పట్లు, అనారోగ్యంగా ఉన్న వారికి ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందన్నారు. దాతలు,సభ్యుల సహకారంతో క్రమం తప్పకుండా ప్రతి శుక్రవారం సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో షేక్ మస్తాన్ వలి ఆర్మీ రిటైర్డ్,షేక్ బహదూర్ భాష,షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



# మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో పర్యావరణహిత వినాయక విగ్రహాల తయారీ పోటీ

బాపట్ల : సెప్టెంబర్ 11 ( ప్రజా వీక్షణం )

బాపట్ల ఉమెన్స్ ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం ( ఎన్ ఎస్ ఎస్ ) ఆధ్వర్యంలో వినాయక చవితిని పురస్కరించుకుని విద్యార్థులకు " పర్యావరణహిత వినాయక విగ్రహాల తయారీ పోటీ" నిర్వహించారు.కళాశాల ఓపెన్ డయాస్‌లో ఉదయం 11:00 గంటల నుంచి మధ్యాహ్నం 12:00 గంటల వరకు ఈ పోటీ జరిగింది. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, మట్టి, పేపర్ మరియు ఇతర సహజసిద్ధమైన పర్యావరణహిత పదార్థాలతో వినాయక విగ్రహాలను తయారు చేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు.వినాయక చవితి వేడుకల్లో పర్యావరణానికి హాని కలిగించే పదార్థాలను నివారించి, పర్యావరణహిత విగ్రహాలను ఉపయోగించడంపై విద్యార్థుల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. పర్యావరణ పరిరక్షణతో పాటు సంప్రదాయాలను కొనసాగించాలనే సందేశాన్ని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అందించారు.
విద్యార్థుల ఉత్సాహభరితమైన భాగస్వామ్యాన్ని కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ మరియు అధ్యాపకులు అభినందించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డా. సీ.హెచ్. హిమబిందు, వైస్ ప్రిన్సిపాల్ శ్రీమతి ఐ. హరిత, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, ఎన్ ఎస్ ఎస్ కోఆర్డినేటర్లు మరియు ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.







# బాపట్లలో బీజేపీ బీసీ నాయకుల ఆత్మీయ సమావేశం విజయవంతం

బాపట్ల : సెప్టెంబర్ 11 ( ప్రజా వీక్షణం )

బాపట్ల జిల్లాలో ఓబీసీ మోర్చాను మరింత బలోపేతం చేసి,బీసీ నాయకులు మరియు కార్యకర్తలను పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా భాగస్వాములను చేస్తామని ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షులు తాడివలస దేవరాజు తెలిపారు.బాపట్ల జిల్లా పార్టీ కార్యాలయంలో శుక్రవారం బాపట్ల జిల్లా ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో బీసీ నాయకుల ఆత్మీయ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బాపట్ల జిల్లా అధ్యక్షులు మువ్వల వెంకట రమణారావు,ఓబిసి మోర్చా బాపట్ల జిల్లా ఇన్చార్జ్ కేతిగుంట్ల సుబ్బరాయుడు, ఓబిసి రాష్ట్ర కార్యదర్శి కొక్కిలిగడ్డ శ్రీనివాసరాజు,బిజెపి రాష్ట్ర నాయకులు ఇంటూరి బాబ్జి, గొల్లపల్లి లలిత్ ప్రజాపతి పాల్గొన్నారు.డాక్టర్ తాడివలస దేవరాజు అధ్యక్షతన బాపట్ల జిల్లాలోని బీసీ నాయకుల పరిచయం,ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడంతో పాటు జిల్లా మరియు మండల స్థాయిలో ఓబీసీ కమిటీల ఏర్పాటు,బాపట్ల జిల్లా లో పార్టీ కార్యక్రమాల్లో బీసీల భాగస్వామ్యాన్ని మరింత పెంచే అంశాలపై నాయకులు చర్చించారు.అలాగే ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో భవిష్యత్తులో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. జిల్లా మరియు మండల స్థాయిలో పార్టీ కార్యక్రమాలకు సమయం కేటాయిస్తూ చురుకుగా పనిచేయడానికి ఆసక్తి ఉన్న బీసీ నాయకులు,కార్యకర్తల నుంచి బయోడేటాలను స్వీకరించి, వారి సేవలను పార్టీ కార్యక్రమాల్లో వినియోగించుకోవాలని నిర్ణయించారు.బీజేపీ బాపట్ల జిల్లా అధ్యక్షులు రమణారావు ఆధ్వర్యంలో కర్లపాలెం మాజీ సర్పంచ్ బన్నరావూరి శ్రీనివాసరావు గారు బిజెపి లో చేరారు.ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన బీజేపీ నాయకులు,బీసీ నాయకులు మరియు కార్యకర్తలకు బాపట్ల జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షులు డాక్టర్ తాడివలస దేవరాజు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా బిజెపి అధ్యక్షులు మువ్వల వెంకటరమణ బాపట్ల జిల్లా ఓబీసీ జిల్లా ఇన్చార్జి కేతిగుంట్ల సుబ్బారాయుడు,ఓ బి సి రాష్ట్ర కార్యదర్శి కొక్కిలిగడ్డ శ్రీనివాస్ రాజు, బిజెపి రాష్ట్ర నాయకులు ఇంటూరి బాబ్జి నంద,గొల్లపల్లి లలిత్ ప్రజాపతి,అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ విశ్వనాథపల్లి వెంకటేశ్వర్లు, బాపట్ల ఏం సి డైరెక్టర్ ఏ రామరాజు,మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి జి వి యల్ మోహన్ గౌడ్, ఓబిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కారంచేటి నగేష్ కుమార్,సన్న బోయిన శ్రీనివాసాచారి,జిల్లా అధికార ప్రతినిధి జక్కా శ్రీనివాస్ యాదవ్,కర్లపాలెం మండల అధ్యక్షులు కరిముల్లా,రేపల్లె రూరల్ అధ్యక్షులు ఏమినేని డానియల్, ఓ బి సి ట్రెజరర్ కారంచేటి శివరామకృష్ణ, తురక గోపి, తిరుపతయ్య, క్షత్రియ సుహాసిని,యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి నాశిన మణికుమార్,యువ మోర్చా జిల్లా అధ్యక్షులు శయిల కృష్ణార్జున్,కలవకూరి బసవేశ్వర రావు,కొక్కిలగడ్డ చంద్ర,అంకమ్మరావు మరియు బాపట్ల జిల్లా బిసి సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.




# పోలవరం నియోజకవర్గంలో ఘనంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక

## కూటమి ప్రభుత్వంలో ప్రతి సమస్యకూ తక్షణ పరిష్కారం: టీడీపీ ఇంచార్జ్ బొరగం శ్రీనివాసులు

బుట్టాయగూడెం, సెప్టెంబర్ 11:(ప్రజా వీక్షణం)

ప్రజా సేవయే పరమార్థంగా, ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోలవరం నియోజకవర్గంలో ప్రత్యేక గ్రీవెన్స్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. పోలవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ మరియు ఏపీ రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు బుట్టాయగూడెం మండలం పులిరామన్న గూడెం మరియు నియోజకవర్గం క్యాంప్ కార్యాలయం బుసరాజుపల్లిలో ఈ ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు.నియోజకవర్గంలోని నలుమూలల నుండి భారీ సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు, మహిళలు మరియు రైతులు తమ వ్యక్తిగత అలాగే సామాజిక సమస్యలను శ్రీనివాసులు దృష్టికి తీసుకువచ్చారు. ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన ఆయన, వాటిని క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు సంబంధిత అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సమస్యకూ న్యాయం జరుగుతుందని భరోసానిచ్చారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పోలవరం సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. అలాగే రాబోయే కార్యక్రమాలపై బూత్, యూనిట్, క్లస్టర్ ఇంచార్జ్‌లతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రముఖ నాయకులు పైదా వసంతరావు, మనీకాల శ్రీను, బచ్చుల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# చవితికి సిద్ధమైన గణపతులు..

## సోలాపూర్ గణపతి తక్కువ ధరకే విక్రయం..

దేవరకద్ర సెప్టెంబర్ 11 ప్రజావిక్షణం

ఈనెల 14నుంచి ప్రారంభం కనున్న వినాయక చవితి సందర్భంగా విక్రయానికి గణపతులు సిద్ధంగా ఉన్నాయి. రాజస్థాన్ చెందిన భరత్ అనే వారి కుటుంబ సభ్యులు వినాయక చవితి సందర్భంగా వివిధ రకాలైన వినాయక విగ్రహాలను సోలాపూర్ ఫినిషింగ్ తో తయారు చేసి పెట్టారు. తక్కువ ధరకే వినాయక విగ్రహాలు అమ్మడం జరుగుతుందని ఆయన తెలిపారు. వివిధ గ్రామాల చెందిన ప్రజలు కూడా ఇక్కడికి వచ్చి వినాయక విగ్రహాలను తీసుకొని వెళ్లాలని ఆయన కోరారు.



# జిల్లా సీనియర్ సివిల్ జడ్జి ఇందిరా చేతుల మీదుగా....

## అశ్విని చంద్రశేఖర్ కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం ప్రదానం..

దేవరకద్ర సెప్టెంబర్ 11 ప్రజావిక్షణం

దేవరకద్ర మండల పరిధిలోని లక్ష్మీపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల లో పనిచేస్తున్న ఎస్ జి టి ఉపాధ్యాయులు లయన్ అశ్విని చంద్రశేఖ ర్ కు ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది .పాలమూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శు క్రవారం మహబూబ్ నగర్ లోని అం ధుల ఆశ్రమం పాఠశాలలో నిర్వహించిన ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ప్రధానో త్సవ కార్యక్రమానికి జిల్లా సీనియర్ సివిల్ జడ్జి , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి డి. ఇందిరా ముఖ్య అతిథులు గా హాజరయ్యారు. ఈ సందర్బంగా పాఠశాల ప్రగతికి, విద్యాభివృద్ధి కి విశేష కృషి చేస్తున్న అశ్విని చంద్రశేఖర్, జిల్లా సీనియర్ జడ్జి డి.ఇందిరా, చేతుల మీదుగా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్నారు. ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న లయన్ అశ్విని చంద్రశేఖర్ ను లయన్స్ ఇంటర్నేషనల్ ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లయన్ నటరాజ్, పాలమూరు లయన్స్ క్లబ్ అధ్యక్షులు బాబుల్ రెడ్డి, కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి యతిరాజ చారి, ప్రోగ్రామ్ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, కో చైర్మన్ శ్రీహరి, సభ్యులు ప్రసాద్, సుబ్రహ్మణ్యం, అశోక్ కుమార్ లు ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు.



# జంగారెడ్డిగూడెంలో ఘనంగా జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం








### అడవుల పరిరక్షణలో ప్రాణాలర్పించిన వీరులకు అటవీ శాఖ అధికారుల ఘన నివాళి

### అమరవీరుల ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపు

### జంగారెడ్డిగూడెంలో ఉత్సాహంగా సాగిన చైతన్య ర్యాలీ

జంగారెడ్డిగూడెం, సెప్టెంబర్ 11:(ప్రజా వీక్షణం)

ప్రకృతిని, అడవులను కంటికి రెప్పలా కాపాడుతూ... విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా అంకితమైన అటవీ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం పట్టణంలో 'జాతీయ అటవీ అమరవీరుల సంస్మరణ దినోత్సవం' శుక్రవారం అత్యంత ఘనంగా, భావోద్వేగ వాతావరణంలో నిర్వహించారు. స్థానిక అటవీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన అమరవీరుల స్తూపం వద్ద అటవీ శాఖ అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో భాగంగా అటవీ శాఖ అధికారులు మరియు సిబ్బంది అటవీ అమరవీరుల స్తూపానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా అడవుల రక్షణ కోసం ప్రాణాలర్పించిన ఆ ధీరుల సాహసాన్ని, త్యాగాలను కొనియాడారు. అనంతరం అమరవీరుల ఆత్మశాంతి కోరుతూ రెండు నిమిషాలు మౌనం పాటించి, వారి కుటుంబాలకు తమ సంఘీభావాన్ని ప్రకటించారు. కేవలం నివాళులర్పించడంతో సరిపెట్టకుండా, అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో అటవీ శాఖ అధికారులు ఒక ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అడవుల పరిరక్షణ కోసం, అడవుల ప్రాముఖ్యతపై ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని కోరుతూ అటవీ ప్రాంగణం నుండి ప్రధాన వీధుల గుండా ప్రత్యేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. పచ్చదనాన్ని కాపాడటం ద్వారానే భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తు లభిస్తుందని, చెట్లను నరకడం వల్ల కలిగే ముప్పును ప్రజలకు అవగాహన కల్పించేలా నినాదాలు చేస్తూ ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎ. వెంకట సుబ్బయ్య, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి. దుర్గా కుమార్ బాబు, ప్రభుత్వ కలప మరియు వెదురు డిపో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ వి. రాజు, ధర్మారావు, ఎఫ్ఎస్ఓలు రాంబాబు, ఎంఎస్ఆర్ మూర్తి, రేంజ్ రైటర్ బాజీ, అలాగే పలువురు సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు మరియు అటవీ శాఖ సిబ్బంది అంతా ఏకతాటిపై నిలిచి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అటవీ సంరక్షణకు తమ ప్రాణాలొదిలిన అమరవీరుల స్మృతులు ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తాయని ఈ వేడుక మరోసారి చాటిచెప్పింది.

## పత్రికల కథనంతో కదిలిన తిరుమలదేవిపేట పంచాయతీ యంత్రాంగం

### సాలిగూడెం గ్రామంలో కొత్త వీధిలైట్లు ఏర్పాటు.. హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

టీ. నర్సాపురం: సెప్టెంబర్ 11(ప్రజా వీక్షణం)



ఏలూరు జిల్లా, టీ.నర్సాపురం మండలం, తిరుమలదేవిపేట పంచాయతీ పరిధిలోని సాలిగూడెం గిరిజన గ్రామానికి ఎట్టకేలకు వెలుగులు వచ్చాయి. గత కొద్ది రోజులుగా గ్రామంలో వీధిలైట్లు వెలగక ప్రజలు పడుతున్న నానా తంటాలపై పత్రికల్లో వరుస కథనాలు వెలువడిన విషయం తెలిసిందే. ఈ వార్తలపై స్పంది ంచిన పంచాయతీ అధికారులు చివరకు కదిలారు. వెంటనే సిబ్బందిని సాలిగూడెం గ్రామానికి పంపి, కాలిపోయిన పాత బల్బులను తొలగించి కొత్త వీధిలైట్లను బిగించారు. గ్రామంలో లైట్లు వెలగడంతో రాత్రిపూట చీకటి సమస్య పూర్తిగా తొలగిపోయింది. పాములు, తేళ్లు, దొంగల భయంతో బిక్కుబిక్కుమంటూ బతికిన తమకు ఇప్పుడే అసలైన ఊరట లభించిందని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకెళ్లిన మీడియా ప్రతినిధులకు, వెంటనే స్పందించి లైట్లు వేయించిన పంచాయతీ అధికారులకు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వం

### బాపట్ల శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు

బాపట్ల : సెప్టెంబర్ 11 ( ప్రజా వీక్షణం )

బాపట్ల నియోజకవర్గం కర్లపాలెం మండలం కర్లపాలెం గ్రామంలో శ్రీ పెద్దింటమ్మ తల్లి కల్యాణ మండపంలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశానుసారం చేపట్టిన "ఒక నెల -- ఒక నియోజకవర్గం -- నాలుగు పర్యటనలు" కార్యక్రమంలో భాగంగా ప్రజా దర్బార్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొని బాపట్ల నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారులతో ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు స్వయంగా మాట్లాడి వారి సమస్యలను విన్నారు. ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తూ, ఆయా సమస్యల తీవ్రతను అక్కడికక్కడే అధికారులకు వివరించి, నిబంధనల ప్రకారం నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ.....కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ప్రథమ కర్తవ్యంగా ముందుకు సాగుతోందని, సమస్యల పరిష్కారం కోసం ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా నేరుగా వారి వద్దకే వచ్చి అర్జీలు స్వీకరిస్తున్నామని తెలిపారు. ప్రజా దర్బార్‌లో అందిన ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు మరియు వివిధ గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఆర్ ఐని సన్మానించిన గ్రామ సర్పంచ్..

దేవరకద్ర సెప్టెంబర్ 11 ప్రజా విక్షణం

మండల పరిధిలోని వెంకటపల్లి గ్రామంలో రంగనాయక స్వామి ఉత్సవాలు సందర్భంగా శుక్రవారం ఆర్ ఐ శరత్ నాయక్ , జిబి ఓ రాజు, అక్కడ స్వామివారి దర్శనానికి వెళ్లారు. గ్రామ సర్పంచ్ రామాంజనేయులు, వారిని శాలువాతో సత్కారం చేశారు.





# సొంత డబ్బులు ఖర్చు చేసి రైతులకు నీళ్లు ఇవ్వగలరా..

### రైతుల కోసం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తీసుకొచ్చిన సంస్కరణలతోనే రైతులకు మేలు జరిగింది

### కర్లపాలెం రైతు భరోసా పాదయాత్రలో ఎమ్మెల్యే నరేంద్ర వర్మకు మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి సవాల్

కర్లపాలెం ( బాపట్ల ) : సెప్టెంబర్ 11

( ప్రజా వీక్షణం )

బాపట్ల నియోజకవర్గంలో సాగునీటి అంశం రాజకీయంగా వేడెక్కింది. పంట కాలువలు, మురుగు కాలువల నిర్వహణ విషయంలో మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతిపై ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు చేసిన విమర్శలకు ఆయన ఘాటుగా స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో పంట కాలువలు, మురుగు కాలువల అభివృద్ధిని పట్టించుకోలేదంటూ ఎమ్మెల్యే చేసిన ఆరోపణలను కోన రఘుపతి తీవ్రంగా ఖండించారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు ఎదురైన సమయంలో తాను సొంత నిధులతో మోటార్లు ఏర్పాటు చేసి నల్లమడ, తుంగభద్ర కాలువల నుంచి పంట కాలువలకు నీటిని తరలించి వేలాది ఎకరాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నట్లు గుర్తుచేశారు. సంవత్సరంలో రెండు మూడు సార్లు నాటితే గాని పంట పండని మూలపాలెం లాంటి పొలాలకు కూడా తన సొంత నిధుల ద్వారా ఏర్పాటుచేసిన మోటార్ల ద్వారా నీటిని అందించి రైతులు పంట పండించుకునేటట్లు గత ప్రభుత్వంలో తాను చేశానని ఆయన స్పష్టం చేశారు రైతుల ప్రయోజనాల కోసం అవసరమైనప్పుడు వ్యక్తిగతంగా ముందుకొచ్చి ఖర్చు చేశానని పేర్కొన్న ఆయన, ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ రాజు కూడా అదే విధంగా సొంత నిధులు వెచ్చించి రైతులకు సాగునీరు అందించేందుకు సిద్ధమేనా అని సవాల్ విసిరారు .విమర్శలు చేయడం కంటే రైతుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ చూపాలని ఆయన సూచించారు. అధికారంలో ఉన్నవారు రాజకీయ ఆరోపణలకు పరిమితం కాకుండా రైతులకు ఉపయోగపడే చర్యలు చేపట్టాలని కోరారు. సాగునీటి అంశంపై అధికార, ప్రతిపక్ష నేతల మధ్య కొనసాగుతున్న ఈ మాటల యుద్ధం బాపట్ల రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. రైతులను నట్టంటే ముంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుకు అండగా ఉండి అన్ని విధాలుగా ఆదుకోవాల్సిన ప్రభుత్వం రైతులకు మొండి చేయి చూపిస్తుందని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి విమర్శించారు గత ప్రభుత్వంలో రైతుల తరఫున మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పంట బీమాను చెల్లించారని ఇప్పుడు ప్రతి రైతు ఎకరాకు 800 తన సొంత నిధులు చెల్లించి పంట బీమా చేయించుకోవలసిన దుస్థితి నెలకొంది అన్నారు. సంపద సృష్టి పేరుతో రాష్ట్ర ప్రజలను మోసం చేసి సాగునీరు కూడా అందించలేక కళ్ళముందే పంటలు ఎండిపోతా ఉంటే రైతన్నలు ప్రయోజనాలను గాలికి వదిలేసారు అన్నారు. ఎన్నికల సమయంలో పింఛన్ల పేరుతో హడావుడి స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ప్రజలను మరొక్కసారి మభ్యపెట్టడానికి పింఛన్ల పేరుతో ఈ కూటమి ప్రభుత్వం హడావుడి చేస్తుందని మాజీ డిప్యూటీ స్పీకర్ కోన రఘుపతి ఆరోపించారు. ఎన్నికలకు ముందు 50 ఏళ్లకే బీసీలకు పింఛన్ ఇస్తానని అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన రెండున్నర సంవత్సరాల తరువాత ఇప్పుడు విడుదల చేసిన పింఛన్లలో 50 ఏళ్లకు ఇచ్చే పెన్షన్ హామీని గాలికి వదిలేసారు అన్నారు ఇప్పుడు ఇస్తున్న పెన్షన్లు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రకటించిన పింఛన్లే అన్నారు 50 ఏళ్లకు పింఛన్ పేరుతో అందరినీ మోసం చేసి ఇస్తున్న ఈ పింఛన్లలో కూడా కావాల్సిన కాగితాల పేరుతో మీ సేవకు సచివాలయాలకు లబ్ధిదారులను తిప్పుతూ కాలయాపన చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలందరూ బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు శుక్రవారం కర్లపాలెం మండలంలోని సత్యవతి పేట వద్ద నుంచి రెడ్డిపాలెం వరకు రైతు భరోసా పాదయాత్ర జరిగింది 20 పంచాయతీల నుంచి రైతులు వైసీపీ నాయకులు కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు రైతులు సంఘీభావం తెలియజేస్తూ ఆయన వెంట నడిచారు మొత్తం మీద ఈ పాదయాత్ర వైసిపి పార్టీలు నూతన జోష్ ను తీసుకువచ్చింది, ఈ పాదయాత్రలో ఆయన వెంట పార్టీ పరిశీలకులు సురేంద్ర మండల పార్టీ కన్వీనర్లు ఏడుకొండలు కాగిత సుధీర్ బాబు లీలా శ్రీనివాస్ రెడ్డి ఏడుకొండలు రెడ్డి జిల్లా కార్యదర్శి జయ భరత్ రెడ్డి ప్రముఖ వ్యాపారవేత్త పేరాల వెంకట సురేష్ మందపాటి పరమానంద కుమార్ యువజన అధ్యక్షులు సాగర్ బెనర్జీ కోకి రాఘవరెడ్డి వడ్డీముక్కల డేవిడ్ చల్లా రామయ్య, యువజన విభాగం అధ్యక్షుడు చెంచయ్య , ట్రేడ్ యూనియన్ నాయకులు నాగేశ్వరరెడ్డి మాజీ సర్పంచులు ఎంపీటీసీలు వివిధ పదవుల్లో ఉన్న నాయకులు పాల్గొన్నారు.



## చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి ..ఎస్సై భాస్కర్ రెడ్డి

దేవరకద్ర సెప్టెంబర్ 11 ప్రజా విక్షణం




వినాయక చవితి పండుగను ప్రజలంతా శాంతియుతంగా భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని స్థానిక ఎస్ఐ భాస్కర్ రెడ్డి కోరారు . శుక్రవారం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఎస్సై మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు ముందస్తు అనుమతులు తీసుకుని నిబంధనలకు అనుగుణంగా మండపాలను ఏర్పాటు చేయాలని అన్నారు. విగ్రహ ప్రతిష్ఠ నుంచి నిమజ్జనం వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు, భక్తులు పోలీసులకు సహకరించాలని కోరారు. మండపాల వద్ద భద్రతా చర్యలు పాటించాలని, డీజేలు, మైక్‌ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచిం చారు. నిమజ్జనం సందర్భంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసుల సూచనలను పాటించాలని, యువత ఎలాంటి ఉద్రిక్తతలకు తావులేకుండా సంయమనంతో వ్యవహరించాలని అధికారులు పేర్కొన్నారు. ప్రజలందరూ సమన్వయంతో పండుగను సంతోషకరమైన వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వారు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# తాడేపల్లిగూడెంలో బ్యాంకు ఉద్యోగుల సమ్మె విజయవంతం

తాడేపల్లిగూడెం ప్రతినిధి, సెప్టెంబర్11 (ప్రజా వీక్షణం)

బ్యాంక్ ఉద్యోగులకు ఐదురోజుల పనివారం అమలు చేయాలని, ఖాళీలు భర్తీ చేయాలని , తమ అపరిష్కృత సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ శుక్రవారం బ్యాంకు ఉద్యోగులు చేపట్టిన దేశవ్యాప్త సమ్మె తాడేపల్లిగూడెంలో సంపూర్ణంగా విజయవంతం అయ్యింది. అధికారులు, ఉద్యోగులు పూర్తిగా సమ్మెలో పాల్గొనడంతో బ్యాంకులన్నీ మూతపడ్డాయి. పట్టణంలో పరిసర గ్రామాల్లో బ్యాంకింగ్ కార్యకలాపాలు పూర్తిగా స్తంభించిపోయాయి. యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ పిలుపు మేరకు ఈ సమ్మె జరిగింది. సమ్మెలో పాల్గొన్న అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది కే.ఎన్.రోడ్డులోని స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ కార్నర్ వద్దకు ఉదయం పది గంటలకే చేరుకున్నారు. బ్యానర్లు, ప్లే కార్డులు, యూనియన్ పతాకాలు చేతబూనిన సిబ్బంది పెద్దపెట్టున నినాదాలు చేశారు. ఉద్యోగుల నినాదాలతో ఆ ప్రాంతం హోరెత్తింది. మహిళా ఉద్యోగులు సైతం పెద్ద సంఖ్యలో ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా బ్యాంకు ఉద్యోగుల సమాఖ్య కార్యదర్శి తోట సూర్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న లక్షలాది ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులకు వారానికి ఐదు రోజులు పనిదినాలు అమలు చేస్తామంటూ ఇండియన్ బ్యాంకర్స్ అసోసియేషన్ ఉద్యోగ సంఘాలతో చేసుకున్న ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం అంగీకరించిన అంశాన్ని అమలు చేయాలని మాత్రమే తాము కోరుతున్నామని స్పష్టం చేశారు. దేశంలో కేంద్ర ప్రభుత్వ సంస్థలన్నింటి లోనూ, ప్రైవేట్ కంపెనీలలోనూ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, నాబార్డ్ , మనీ మార్కెట్, ఫారెన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్ వంటి సంస్థల్లో ఐదు రోజుల పనివారం అమలులో ఉండగా, బ్యాంకు ఉద్యోగులకు అదే సదుపాయాన్ని కల్పించకపోవడం అన్యాయమని వివరించారు.ఏఐటియుసి రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ బ్యాంకులను నిర్వీర్యం చేయడానికే కుట్ర చేస్తున్నదన్నారు. విదేశీ బ్యాంకులను అనుమతించడం, బడా పారిశ్రామిక సంస్థల రుణాలను మాఫీ చేయడం వంటి చర్యలు ప్రభుత్వ రంగ బ్యాంకులను దెబ్బతీయడమేనని అన్నారు. ఆటోమేషన్ తో ఉద్యోగులపై పనిఒత్తిడి తగ్గాల్సింది పోయి పనిభారం పెరిగిపోయిందని, రాత్రి పొద్దుపోయేవరకు సిబ్బంది బ్యాంకుల్లోనే పనిచేయాల్సి వస్తోందని, వారి పని మొత్తం ఆర్థిక లావాదేవీలు కావడంతో సిబ్బంది మానసిక ఆరోగ్యాలు కూడా దెబ్బ తింటున్నాయని సోమసుందర్




అన్నారు. వెంటనే బ్యాంకుల్లో ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. వివిధ బ్యాంకు యూనియన్లకు చెందిన యు.ఎఫ్.బి.యు. నాయకులు మాట్లాడుతూ భద్రత లేని కొత్త పెన్షన్ పథకాన్ని రద్దు చేయాలనీ , బ్యాంకు ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. రిటైర్ అయిన ఉద్యోగు లందరికీ ఒకే విధమైన డిఏ ఫార్ములా ఉండాలని , రిటైర్ అయిన ఉద్యోగులకు పెన్షన్ రివిజన్ చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకు ఉద్యోగులకు గ్రాట్యూటీ సీలింగ్ పెంచాలని డిమాండ్ చేశారు. సభలో ఏఐటీయూసీ ఏరియా సమితి అధ్యక్షుడు ఓసూరి వీర్రాజు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్ అసిస్టెంట్ జనరల్ సెక్రెటరీ పి.రాంప్రసాద్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ డి.శ్రీధర్, ఎస్.బి.ఐ.సిబ్బంది సంఘం నాయకులు మానుకొండ కిరణ్ , యూనియన్ బ్యాంకు నాయకులు దివ్య రజనీ, యూనియన్ బ్యాంకు సిబ్బంది సంఘం నాయకులు లింగంపల్లి గాంధీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ కార్యదర్శి ఏడుకొండలు, ఆర్బీవో అధికారుల సంఘం కార్యదర్శి సి.హెచ్. రామలింగేశ్వరరావు,ఎస్.బి.ఐ.సిబ్బంది సంఘం నాయకులు పవన్ కుమార్, మనోజ్ తదితరులు మాట్లాడారు. సమ్మె చేస్తున్న బ్యాంకు ఉద్యోగులకు భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, హార్టీకల్చర్ యూనివర్సిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కోటుం నాగేశ్వరరావు, కార్యదర్శి కృష్ణారావు తదితరులు మద్దతు ఇచ్చారు.

# మానవత బాపట్ల శాఖ ఆధ్వర్యంలో పాఠశాలకు పుస్తకాలు,మొక్కలు పంపిణీ.

కర్లపాలెం : సెప్టెంబర్ 11 ( ప్రజా వీక్షణం )

మానవత శాఖ బాపట్ల వారు కర్లపాలెం మండలం సమెటివారిపాలెంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థిని విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ శరత్ బోసు.....మాట్లాడుతూ నేటి సమాజానికి అవసరమైన ది చదువు, పర్యావరణ అని అన్నారు. ఆ రెండిటిని మానవతా శాఖ ద్వారా తమ వంతు తాము సమాజానికి సేవ చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమానికి ఆ శాఖ చైర్మన్ డాక్టర్ శరత్ బోసు, ప్రెసిడెంట్ గురజాల శ్రీనివాసరావు పాల్గొని ప్రసంగించారు,ఈ సందర్భంగా ఆ శాఖ అధ్యక్షులు గురజాల శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరూ బాధ్యత అన్నారు.అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు,విద్యార్థిని విద్యార్థులకు నోటుపుస్తకాలు పంపిణీ చేశారు.సామాజిక సేవకురాలు బండ్రెడ్డి రజనిని ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాధవి లత,కర్లపాలెం మానవత శాఖ చైర్మన్ టి సుబ్బారావు,లలిత బాబు డైరెక్టర్ ఇనకొల్లు పోలీసురావు,సామాజిక సేవకురాలు బండ్రెడ్డి రజని తదితరులు పాల్గొన్నారు.



# వైద్యం అందక ఏ ఒక్క పేదవాడూ ఇబ్బంది పడకూడదు... పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

## పోలవరం నియోజకవర్గానికి సీఎం సహాయ నిధి వరస ప్రవాహం: 28వ విడతగా రూ.83.23 లక్షల భారీ ఆర్థిక సాయం మంజూరు!

## పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం అడుగులు

## కుక్కునూరు మండలంలో ఘనంగా ప్రారంభమైన చెక్కుల పంపిణీ కార్యక్రమం

పోలవరం నియోజకవర్గం 11(ప్రజా వీక్షణం)

పోలవరం నియోజకవర్గ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో, పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారాన్ని తగ్గించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో అండగా నిలుస్తోందని పోలవరం నియోజకవర్గ శాసనసభ్యులు చిర్రి బాలరాజు ఉద్ఘాటించారు. శుక్రవారం బర్రింకాలపాడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం సహాయ నిధికి సంబంధించిన చెక్కుల అందజేత కార్యక్రమం నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో భాగంగా కుక్కునూరు మండలానికి చెందిన పల్లేల మారేశ్వరికి అనారోగ్య వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.66,572 విలువైన సీఎం సహాయ నిధి చెక్కును ఎమ్మెల్యే చిర్రి బాలరాజు స్వయంగా అందజేశారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, పోలవరం నియోజకవర్గానికి 28వ విడతగా మొత్తం 51 చెక్కులు మంజూరయ్యాయని, ఈ విడతలో మంజూరైన చెక్కుల ద్వారా మొత్తం రూ.83 లక్షల 23 వేల విలువైన భారీ ఆర్థిక సాయం లభిస్తోందని తెలిపారు. లబ్ధిదారులు ఎలాంటి కార్యాలయాల చుట్టూ



తిరగకుండా, ఈ చెక్కులను నేరుగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి పేదల సంక్షేమమే ప్రధాన అజెండాగా ముందుకు సాగుతోందని, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో వైద్యం చేయించుకోలేక ఇబ్బంది పడుతున్న ఎన్నో కుటుంబాలకు సీఎం సహాయ నిధి వరంగా మారిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఏ ఒక్క పేదవాడు కూడా వైద్యం అందక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు.ఈ కార్యక్రమంలో కుక్కునూరు మండల జనసేన పార్టీ నాయకులు మంత్రి గోపాలకృష్ణ, చల్లా కోటి, గాడిద వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటికి రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు తోట లక్ష్మీనారాయణ ఘన అభినందనలు

ఏలూరు సెప్టెంబర్ 11(ప్రజా వీక్షణం)

రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఎమ్మెల్యేగా 6వ ర్యాంక్ సాధించిన ఏలూరు శాసనసభ్యులు, ఏలూరు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బడేటి రాదాకృష్ణయ్య (చంటి) ని రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు తోట లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సుపరిపాలన ఆధ్వర్యంలో ప్రజల మధ్యనే ఉంటూ, వారి సమస్యల పరిష్కారమే ఏకైక లక్ష్యంగా బడేటి చంటి నిరంతరం శ్రమిస్తున్నారని తోట లక్ష్మీనారాయణ కొనియాడారు.?రాష్ట్ర అభివృద్ధిలోనూ, సంక్షేమ కార్యక్రమాలలోనూ క్రియాశీలక భాగస్వామ్యం వహిస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ భరోసాగా నిలుస్తున్న ఆయన నాయతీశయాలు ప్రశంసనీయమని ఆయన పేర్కొన్నారు. “బడేటి అంటే బాధ్యత” అనే నినాదానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తూ, రాష్ట్రాన్ని ముందుకు నడిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రశంసలు అందుకోవడం ఎంతో గర్వకారణమని తోట లక్ష్మీనారాయణ అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాదాకృష్ణయ్య (చంటి) కి ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.



# గర్భిణీ స్త్రీలు ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి:.. సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి

ములకలపల్లి, సెప్టెంబర్ 11:(ప్రజా వీక్షణం)

మూకమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని సాయిరాంపురం అంగన్‌వాడీ కేంద్రంలో 'పోషణ మాసం' కార్యక్రమాన్ని శుక్రవారం అత్యంత వైభవంగా మరియు ఘనంగా నిర్వహించారు. మాతా శిశు సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా చేపట్టిన ఈ కార్యక్రమానికి మూకమామిడి సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె గ్రామస్థులకు, ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు మరియు తల్లులకు పౌష్టికాహారం తాలూకు ప్రాముఖ్యతను, దానిలోని పోషక విలువలను అందరికీ సులభంగా అర్థమయ్యే రీతిలో సవివరంగా వివరించారు.అలాగే గర్భిణీ సమయం అనేది మహిళల జీవితంలో అత్యంత కీలకమైనదని, ఈ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉంటూ ప్రత్యేక శ్రద్ధ వహించాలని సర్పంచ్ సూచించారు. రోజువారీ జీవితంలో సరైన పోషకాహారం తీసుకోకపోవడం వల్ల తల్లీ, బిడ్డలపై పడే దుష్ప్రభావాలను ఆమె వివరించారు. ప్రతి గర్భితి క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి, అక్కడ ప్రభుత్వం ఎంతో శ్రద్ధతో అందించే ఒక పూట సంపూర్ణ భోజనాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.అంతేకాకుండా గర్భిణులు మరియు బాలింతల ఆరోగ్యం కోసం ప్రభుత్వం అందిస్తున్న సంపూర్ణ పోషకాహారం, ఉచితంగా లభించే గుడ్లు, పాలు వంటి పౌష్టికాహార వస్తువులను ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆమె కోరారు. తల్లీ, పుట్టబోయే బిడ్డ ఇద్దరూ సంపూర్ణ ఆరోగ్యంతో, ధృఢంగా ఉండాలంటే పౌష్టికాహార సేవనం ఎంతగానో దోహదపడుతుందని ఆమె నొక్కి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళల్లో పోషకాహార లోపాన్ని నివారించడానికి ప్రభుత్వాలు మరియు అంగన్‌వాడీ శాఖలు చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాలను అందరూ సద్వినియోగం



చేసుకోవాలని ఆమె ఆకాంక్షించారు.ఈ అవగాహన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సామ్రాజ్యం, ప్రధానోపాధ్యాయురాలు అజ్మీర్ లలిత, అంగన్‌వాడీ టీచర్లు జయమ్మ, రాధ, విజయ, రమాదేవి, వసంత, సునీత తదితరులు క్రియాశీలకంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. వీరితో పాటు ఆ గ్రామ పరిధిలోని పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు, పిల్లల తల్లులు, గర్భిణీ స్త్రీలు ఉత్సాహంగా హాజరై పోషణ మాసం విశేషాలను తెలుసుకున్నారు.

# ఫోక్సో నిందితుడికి ఐదేళ్ల జైలు

బాపట్ల : సెప్టెంబర్ 11 ( ప్రజా వీక్షణం )

ఏడేళ్ల బాలికపై వికృత చేష్టలకు పాల్పడిన కేసులో బాపట్ల జిల్లా పర్చూరు మండలం పోతుకట్లకు చెందిన నాదండ్ల వెంకట స్వామి (56)కి ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.6 వేల జరిమానా విధిస్తూ ఒంగోలు ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయ మూర్తి కె.శైలజ శుక్రవారం తీర్పు ఇచ్చారు. బాధితురాలికి రూ.10 వేల పరిహారం చెల్లించాలని ఆదేశించారు. 2023లో జరిగిన ఈ ఘటనపై పర్చూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. సమర్థవంతమైన దర్యాప్తు, కోర్టు ట్రయల్ పర్యవేక్షణతో నిందితుడికి శిక్ష పడిందని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. మహిళలు, చిన్నారులపై నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.



# అటవీ అమరవీరుల త్యాగాలు స్ఫూర్తిదాయకం:కలెక్టర్ అంకిత్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం):

విధి నిర్వహణలో అటవీ సంపద పర్యావరణ పరిరక్షణ కోసం తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన అటవీ శాఖ అధికారులు సిబ్బంది సేవలు త్యాగాలు స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం కొత్తగూడెం ఇల్లందు క్రాస్‌రోడ్స్ లోని చలమల శ్రీనివాసరావు మెమోరియల్ సెంట్రల్ పార్క్‌లో అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ అమర వీరుల సంస్మరణ సభకు జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ముందుగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులు చలమల శ్రీనివాసరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ అంకిత్ పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బానోతు నవీన్ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అటవీ సంపదను కాపాడే క్రమంలో ఎంతో మంది అటవీ శాఖ అధికారులు సిబ్బంది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయారని అన్నారు. వారి త్యాగాలను స్మరించుకోవడం వారి సేవలను భావితరాలకు తెలియ జేయడం మనందరి బాధ్యత అని అన్నారు. అటవీ శాఖలో క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు ఇతర సిబ్బంది అటవీ సంపద సంరక్షణలో అత్యంత కీలకమైన బాధ్యతలను నిర్వర్తిస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు ప్రమాదాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిబ్బందికి అవసరమైన శిక్షణ భద్రతా పరికరాలు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఇతర మౌలిక సౌకర్యాలను అందుబాటులో ఉంచాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం నేరాల స్వభావం మారుతున్న నేపథ్యంలో అటవీ నేరాలను నియంత్రించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత సమర్థవంతంగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. గతంలో ఒక రకమైన నేరాలు అధికంగా ఉండగా ప్రస్తుతం సైబర్ నేరాలు కృత్రిమ మేధస్సు ఆధారిత నేరాలు తదితర కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని అదే విధంగా అటవీ నేరాలను అరికట్టేందుకు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా అటవీ శాఖ సిబ్బంది సాంకేతికంగా మరింత సామర్థ్యం పెంచుకోవాలని అన్నారు. శాస్త్రీయ పద్ధతులు ఆధునిక పరికరాలు లైటింగ్ కమ్యూనికేషన్ తదితర సౌకర్యాలతో పాటు సిబ్బందికి అవసరమైన శిక్షణా కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అటవీ శాఖ సిబ్బంది కుటుంబ సభ్యుల త్యాగాలను కూడా సమాజం ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని కలెక్టర్ అన్నారు. అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని అటవీ సంపదను పరిరక్షించేందుకు అటవీ శాఖ అధికారులు సిబ్బంది మరింత అంకిత భావంతో పనిచేయాలని కష్టపడి



పనిచేయడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విస్తారమైన అటవీ ప్రాంతాన్ని కలిగి ఉందని ఇక్కడి గిరిజన సమాజానికి అడవులతో ఎంతోకాలంగా సన్నిహిత సంబంధం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. కోయలు కొండరెడ్లు తదితర గిరిజన సమాజాలు అడవులతో మమేకమై జీవిస్తున్నారని అటవీ శాఖ గిరిజన సమాజాల మధ్య పరస్పర సహకారం సమన్వయం ఎంతో ముఖ్యమని అన్నారు. అటవీ సంపదను పరిరక్షించడంతో పాటు గిరిజనుల హక్కులను కూడా కాపాడాల్సిన బాధ్యత ఉందని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ అటవీ సంరక్షణ అటవీ హక్కులు తదితర అంశాలపై అధికారులు అటవీ శాఖ సిబ్బంది గిరిజన సమాజాల భాగస్వామ్యంతో అవగాహన శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. అడవులను కాపాడటం పర్యావరణాన్ని పరిరక్షించడం ఎంత ముఖ్యమో అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనుల హక్కులను పరిరక్షించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ రెండు అంశాల మధ్య సమతుల్యతను పాటిస్తూ సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అటవీ అమర వీరుల త్యాగాలను ఎల్లప్పుడూ స్మరించుకుంటూ వారి స్ఫూర్తితో అటవీ సంపదను రక్షించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. అమరవీరుల కుటుంబాలకు ప్రభుత్వం సమాజం అండగా నిలవాలని వారి త్యాగాలకు తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పి రోహిత్ రాజు, జిల్లా అటవీ అధికారి సిధార్థ్ విక్రమ్ సింగ్ , అటవీ శాఖ అధికారులు, ఫారెస్ట్ రేంజ్ అధికారులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, ఇతర అటవీ శాఖ సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ తాతా మధును బర్తరఫ్ చేయాలి

## - టీపీసీసీ అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డి డిమాండ్

భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 11(ప్రజా వీక్షణం):

ఎమ్మెల్సీ తాతా మధును తక్షణమే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర అధికార ప్రతినిధి మద్ది శ్రీనివాస్ రెడ్డి డిమాండ్ చేశారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న అధ్యక్షతన కొత్తగూడెంలోని రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్, బీజేపీ పార్టీలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఇటీవల బీఆర్ఎస్ నాయకులు నిర్వహించిన పసుపు నీళ్ల శుద్ధీకరణ కార్యక్రమాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి చర్యలు అత్యంత పాశవికమైనవని సమాజానికి తప్పుడు సంకేతాలు పంపుతున్నాయని మండిపడ్డారు. అధికారం పోతే అసెంబ్లీకి రారా? అధికారం కోల్పోగానే బీఆర్ఎస్ నాయకులు బాధ్యతారహితంగా ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. ప్రజలు ప్రతిపక్ష హోదా ఇస్తే కేసీఆర్ కనీసం అసెంబ్లీ సమావేశాలకు కూడా హాజరుకాకుండా ప్రజా సమస్యలను గాలికొదిలేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పార్టీ కేవలం ఒకే కుటుంబానికి చెందిన నలుగురు వ్యక్తుల ప్రయోజనాల కోసమే నడుస్తోందని ఎద్దేవా చేశారు. ఆ పార్టీకి ప్రాంతీయ తత్వం తప్ప ప్రజల బాగు పట్టదన్నారు. ఇదే క్రమంలో బీజేపీపై విమర్శలు చేస్తూ బీజేపీ కేవలం మతతత్వ రాజకీయాలతో పబ్బం గడుపుకుంటోందని ఈ రెండు పార్టీలకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తోందని శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణలో ఇప్పటికే విజయవంతంగా రైతులకు రుణమాఫీ ప్రక్రియ కొనసాగుతోందని ఉచిత విద్యుత్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వంటి అనేక ప్రతిష్టాత్మక సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని వివరించారు. భవిష్యత్తులోనూ రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ పార్టీయే అధికారంలోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేఖరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్నతో పాటు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కొనేరు సత్యనారాయణ, ఆళ్ల మురళి, సొసైటీ చైర్మన్ మండే వీరహనుమంతు రావు, శ్రీనివాసరావు, కార్తీక్, వై.శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ జెండా ఎగరవేయాలి

## వడ్డీ రఘురాం ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో వక్తల పిలుపు

తాడేపల్లిగూడెం ప్రతినిది సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం)

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జి వడ్డి రఘురామ్ నాయుడు ఆధ్వర్యంలో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలపై నియోజకవర్గ స్థాయి విస్తృత స్థాయి సమావేశాన్ని స్థానిక గమిని ఫంక్షన్ హాలులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాద్ రాజు, నరసాపురం పార్లమెంటరీ పరిశీలకులు ముదునూరి మురళి కృష్ణంరాజు, వైసీపీ రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్ హాజరయ్యారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలకు నూతన ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యం, ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులు తదితర అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టటంతో పాటు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తున్న తీరుతెన్నులను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలను బలంగా ఎదుర్కొందామని చెప్పారు. ప్రతిపక్షం మనకు కొత్తేమీకాదని, 2014లో మన పార్టీ గెలవకపోయినా, ఎవరూ అధైర్యపడలేదని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేసి 2019లో ఘన విజయం సాధించామని చెప్పారు. వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో దేశంలోని ఏ రాష్ట్రంలోనూ అమలు చేయని విధంగా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. కుల, మత, ప్రాంత, రాజకీయాలు చూడకుండా పథకాలు అందజేశామన్నారు. ప్రజా సేవే పరమావధిగా పని చేశామని,. రాష్ట్రంలో విప్లవాత్మకమైన మార్పులు తెచ్చామని తెలిపారు. కానీ ఐదేళ్లలో మనం చేసిన మంచిని బలంగా ప్రజలకు చెప్పుకోలేకపోయామని, ఐదేళ్ల వైయస్ఆర్ సీపీ పాలనలో కొన్ని విషయాల్లో మనం వెనుకపడ్డామని చెప్పారు. భవిష్యత్‌లో అలాంటి పరిస్థితి పునరావృత్తం కాకుండా చూసుకుంటామని చెప్పారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తే అధినేత అని, ఈ విషయాన్ని జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టంగా చెప్పారని గుర్తుచేశారు. పార్టీని క్షేత్రస్థాయిలో పటిష్టం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుదామని, కూటమి ప్రభుత్వంలో అధికార పార్టీ నేతలు పోలీసు వ్యవస్థను అడ్డు పెట్టుకుని ముందుకు వెళ్తున్నారన్నారు. కిటమి ప్రభుత్వం రెండేళ్ల పాలన అవినీతికి నిలయంగా మారిపోయిందని మట్టి, ఇసుక, లిక్కర్ మాఫియా రాజ్యమేలుతోందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తప్పకుండా గెలవాలని, ఇందుకు అందరూ ఐక్యమత్యంగా ముందుకెళ్లాలని, పార్టీ నియమించిన అభ్యర్థులను గెలిపించు



కుందామని చెప్పారు. అక్టోబర్, నవంబర్ నెలలో ఎన్నికలు ఉంటాయని, ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజా ప్రతినిధుల అవినీతితోపాటు సూపర్ సిక్స్ సహా 143 హామీలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీద్దామని చెప్పారు. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పరిపాలనకు, కూటమి పరిపాలనకు వ్యత్యాసాన్ని ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకొచ్చేలా చూడాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని సూచించారు. డీఎస్సీ అక్రమాలపై సీబీఐతో నిష్పాక్షిక విచారణ జరిపించాలని, డీఎస్సీలో జరిగిన అక్రమాలు రోజుకొకటి బయటకొస్తున్నాయని, ఎటువంటి అర్హతలేని వారిని గురువులుగా నియమించారని ఆరోపించారు. నోటిఫికేషన్ నుంచి నియామకాల వరకు నకిలీ సర్టిఫికెట్లు, తప్పుడు రిజర్వేషన్లతో నడిపిన మెగా డీఎస్సీ పూర్తిగా అక్రమాల పుట్టగా మారిపోయిందన్నారు. నీట్ వ్యవహారంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తప్పుకున్నట్లుగానే, రాష్ట్రంలో జరిగిన డిఎస్సి అక్రమాలు, అవకతవకలకు నైతిక బాధ్యత వహిస్తూ లోకేష్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం దేశంలోనే అత్యంత అవినీతిమయమైన కూటమి పాలనను చూస్తున్నామని విమర్శించారు.. 2025 ఉద్యోగ నోటిఫికేషన్ ఇచ్చిన నాటి నుంచి పోస్టింగులు ఇచ్చే వరకు అడుగడుగున అవినీతి, అడ్డగోలు అవకతవకలకు పాల్పడి అనర్హులకు కొలువులు కట్టబెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనంటూ ఎద్దేవాచేశారు. ఈ సందర్భంగా జై జగన్....జై రఘురాం అంటూ కార్యకర్తల నినాదాలు మిన్నంటాయి. ఈ కార్యక్రమంలో నియోజవర్గ స్థాయి నాయకులు, మరియు పట్టణ,మండల, నాయకులు, ఎంపీపీలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# సిర్పూర్ పేపర్ మిల్లు అంశాన్ని శాసనసభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల నిర్వహణ అంశాన్ని తెలంగాణ రాష్ట్ర శాసనసభలో ప్రస్తావించిన ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల తరఫున హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. సిర్పూర్ పేపర్ మిల్లులో కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికలను వెంటనే నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడిని మరింత పెంచాలని ఎమ్మెల్యే కోరుతున్నాము. అలాగే కార్మికుల మెజారిటీ మద్దతుతో గుర్తింపు ఎన్నికల్లో గెలిచిన సంఘంతోనే వేతన ఒప్పందం (వేజ్ అగ్రిమెంట్) జరగాలి అనే కార్మికుల డిమాండ్ పట్ల ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు సానుకూలంగా స్పందించడం హర్షణీయమని పేర్కొంటున్నాము. సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికులు జె ఎ సి ఆధ్వర్యంలో 115 రోజులుగా గుర్తింపు యూనియన్ ఎన్నికల కోసం గేట్ ముందు నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నారు. కార్మికుల ప్రజాస్వామ్య హక్కులను పరిరక్షిస్తూ, మెజారిటీ కార్మికుల అభిప్రాయానికి అనుగుణంగా గుర్తింపు సంఘాన్ని నిర్ణయించేందుకు వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సిన అవసరం ఉంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు గారు ఈ సమస్యను శాసనసభ దృష్టికి తీసుకెళ్లడం, కార్మికుల న్యాయమైన డిమాండ్‌కు మద్దతు తెలియజేయడం అభినందనీయమని తెలిపారు. కార్మిక శాఖ మంత్రి శ్రీ వివేక్ వెంకటస్వామి శాసనసభలో సమాధానము చెప్పిన విధంగా యాజమాన్యం హైకోర్టులో వేసిన కేసును కొట్టుడు పోయే విధంగా ప్రభుత్వ అడ్వకేటు జనరల్ తో మాట్లాడి పిటిషన్ను సవరించి వెంటనే దాఖలు చేయాలని సిర్పూర్ పేపర్ మిల్లులో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణకు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నాము. అలాగే కార్మికుల మెజారిటీతో ఎన్నికై గెలిచిన గుర్తింపు సంఘంతోనే వేతన ఒప్పందం జరపాలని స్పష్టం చేస్తున్నాము. సిర్పూర్ పేపర్ మిల్లు కార్మికుల న్యాయమైన డిమాండ్‌కు మద్దతుగా నిలిచి, ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచేందుకు సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు మరోసారి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాము. ఈ కార్యక్రమంలో సిర్పూర్ పేపర్ మిల్లు కార్మిక సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ (జె ఎ సి) నాయకులు పాల్గొన్నారు.




# అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ పార్టీ నాయకులు...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం న్యూస్)



కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలో రాష్ట్రంలో గత కొన్ని రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ వద్ద వ్యవహరించిన తీరును కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. అసెంబ్లీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం,దళిత స్పీకర్ పై అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం, మహిళా పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించడం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేసిన దానికి నిరసనగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాల మేరకు ఆసిఫాబాద్ డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క పిలుపు మేరకు రెబ్బెన మండల అధ్యక్షులు కిషన్ అధ్యక్షతన గోలేటి గ్రామంలో గల అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన తెలిపినారు. ఈ సందర్భంగా కిషన్ గౌడ్ మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం దళితుల పట్ల చూపిస్తున్న వివక్షకు ప్రతికారంగా రాబోయే కాలంలో ప్రజలే సరైన బుద్ధి చెప్తారని మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని రేవంత్ సర్కార్ని ప్రజలు ఆదరిస్తారని ఆయన తెలిపినారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చెన్న సోమశేఖర్,మోడెం చిరంజీవి గౌడ్, గుగ్లోత్ రవి నాయక్,కుసుమ విజయ,లింగంపల్లి ప్రభాకర్,సాంబగౌడ్,అడప విమల,అన్నం రమేష్,ఎర్రం తిరుపతి,జాడి తిరుపతి,జాడి ప్రసాద్,జాడి కిషోర్ , జహురుద్దీన్,ఎర్ర సంతోష్ ,సంజీవ్,పస్తాం రాజు,క్రాంతికుమార్, చంద్రశేఖర్, పాల్త్య రవి, తిరుపతి,గొల్ల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

## ఐదవ రోజు కు చేరిన సమీకృత గురుకుల పాఠశాల భూమి కోసం దీక్ష...

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం న్యూస్)

కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నియోజకవర్గంలో ని పెంచికల్ పేట మండలంలో రెవెన్యూ శాఖ 25 ఎకరాల ప్రభుత్వ భూమిని వెంటనే సమీకృత గురుకుల పాఠశాల నిర్మాణానికి అవసరమైన భూమిని పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్కపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 61లో ఉన్నటువంటి ప్రభుత్వ భూమినీ నుంచి 25 ఎకరాల భూమిని తక్షణమే గుర్తించలీ సమీకృత గురుకుల పాఠశాల సాధన జె ఎ సి కన్వీనర్ ఎలగందుల తిరుపతి తెలిగె రమేష్ పుల్గం దమాజీ ఆల్ తెలంగాణ స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర కన్వీనర్ సుంపుటం సాయికిరణ్ నిర్వాహిస్తున్నా ఇట్టి దీక్షకు ఐదవ రోజు సమీకృత గురుకుల పాఠశాల సాధన దీక్షకు పెంచికల్‌పేట్ మండల బి జె పి అధ్యక్షులూ కుకిడే రాజేశ్వర్ మరియు బి జె పి పార్టీ నాయకులు సర్పంచులు బక్కు రామ్‌చందర్ చప్పిడే రవీందర్ మండల సాధన సమితి కన్వీనర్ బిట్టి శ్రీనివాస్ ఎల్కారి లచన్న, పెద్ది శ్రీనివాస్ పాల్గొన్నారు.



## పింఛన్ దరఖాస్తు చేసుకునేందుకు... అర్జీదారులు సచివాలయాల వెంట ప్రదక్షిణాలు చేస్తున్న కనీసం పట్టించుకునే నాథుడే లేరు : వైస్సార్సీపీ పట్టణ అధ్యక్షులు వేమా సురేష్ బాబు

కంచికచర్ల సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం)



ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల పట్టణంలోని సచివాలయం -2 వద్ద పింఛన్ దరఖాస్తుదారులతో మాట్లాడి.కూటమి ప్రభుత్వ తీరుపై మండిపడిన వేమా సురేష్ బాబు చంద్రబాబు అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లు అయిన కొత్త పెన్షన్లు మంజూరు చేయకపోగా.స్థానిక సంస్థల ఎన్నికల ముందు పెన్షన్ల పేరుతో మరోసారి ప్రజలను నమ్మించి వెన్నుపోటు పొడిచేందుకు కొత్త డ్రామాకు తెరలేపారు గత ఐదు రోజులుగా కంచికచర్ల పట్టణంలో సచివాలయాల చుట్టూ వృద్ధులు, వికలాంగులు, వితంతువులైన పెన్షన్ దరఖాస్తుదారులు గంటలు తరబడి ఎదురుచూస్తున్న కనీసం వారి అప్లికేషన్లు ఆన్ లైన్ చేస్తున్న పాపాన పోలేదు... సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్న వృద్ధులకు, మహిళలకు కనీసం తాగునీటి సదుపాయం కూడా కల్పించడం లేదు ప్రజలు రోజువారి కూలి పనులు మానుకొని గత ఐదు రోజులుగా మీ సేవ కేంద్రాల చుట్టూ సచివాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నా అధికారులు స్పందించిన దాఖలాలు లేవు వందలాది దరఖాస్తులు వస్తున్న - కేవలం పదుల సంఖ్యలో ఆన్ లైన్ చేసి మిగతావి సర్వర్ లేదంటూ సాకులు చెబుతూ వారిని రోజుల తరబడి తిప్పుతున్నారు అధికార పార్టీ నాయకులు చెబితేనే ఆన్ లైన్ చేస్తామంటూ దరఖాస్తుదారులకు సచివాలయం సిబ్బంది చెప్పటం హేయనీయం తెలుగుదేశం పార్టీ నాయకుల ఇళ్లకు వెళ్లి చెప్పించుకోండి అని నిర్మొహమాటంగా అధికారులు చెబుతున్నారు గత వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని. కుల, మత, పార్టీ విభేధాలు చూడకుండా అందరికీ మంచి చేశామని గుర్తు చేసిన వేమా సురేష్ బాబు ఇప్పటికైనా ప్రభుత్వం, పాలకులు స్పందించి అధికారుల తీరును మార్చాలని. అర్హులైన దరఖాస్తుదారులందరికీ ఆన్లైన్ చేయాలని. డిమాండ్ చేశారు.వివక్ష చూపితే ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు

## చింతలపాడు ఎస్సీ కమ్యూనిటీ స్మశాన వాటిక అభివృద్ధికి ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సానుకూల స్పందన అడ్వకేట్ కురగంటి రాంబాబు

నందిగామ సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం)



ఎన్టీఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గంలోని ఆర్ ఎస్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీర్స్ ) కార్యక్రమంలో చందర్లపాడు మండలం చింతలపాడు గ్రామానికి చెందిన ఎస్సీ కమ్యూనిటీ స్మశాన వాటిక అభివృద్ధికి సంబంధించి వినతిపత్రం సమర్పించడం జరిగింది.ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ ఇలక్కియ నందిగామ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య నందిగామ ఆర్డీవో అనిల్ తదితర అధికారులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో నందిగామ బార్ అసోసియేషన్ ప్యానల్ అడ్వకేట్ కురగంటి రాంబాబు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య గారిని కలిసి వినతిపత్రం అందజేశారు.చింతలపాడు గ్రామంలోని ఎస్సీ కమ్యూనిటీకి చెందిన స్మశాన వాటిక చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం, స్మశాన వాటిక అవసరాల కోసం బోర్‌వెల్ ఏర్పాటు, షెడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు పరిసర ప్రాంతంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని అమలు చేయాలని వినతిపత్రంలో కోరారు.గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని స్మశాన వాటికకు మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరాన్ని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య దృష్టికి తీసుకెళ్లగా,ఆమె సానుకూలంగా స్పందించి, సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకునే విధంగా అధికారులను ఆదేశిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కురగంటి రాంబాబు మాట్లాడుతూ, చింతలపాడు గ్రామంలోని స్మశాన వాటికకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సానుకూలంగా స్పందించడం పట్ల గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. స్మశాన వాటిక అభివృద్ధి పూర్తయితే స్థానిక ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చింతలపాడు ఎస్సీ కమ్యూనిటీకి చెందిన జంగం పిచ్చారావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్ఎల్ఈపీ సర్వేలో ఓటీపీ విధానం రద్దు చేయాలి

కంచికచర్ల సెప్టెంబర్ 11,ప్రజా వీక్షణం




ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల: ఎన్ఎల్ఈపీ సర్వేలో కొత్తగా ప్రవేశపెట్టిన ఓటీపీ విధానాన్ని తక్షణమే రద్దు చేసి, పాత విధానాన్ని కొనసాగించాలని ఏపీ గ్రామ, వార్డు సచివాలయ హెల్త్ సెక్రటరీ అసోసియేషన్ ఏఐటీయూసీ సభ్యులు ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా కంచికచర్ల మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వసుంధరకు వారు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా హెల్త్ సెక్రటరీలు మాట్లాడుతూ.. ఇప్పటికే పని భారంతో ఇబ్బందులు పడుతున్న సచివాలయ హెల్త్ సెక్రటరీలపై ఓటీపీ విధానం మరింత పని ఒత్తిడిని పెంచుతోందన్నారు. గతంలో ఎన్ఎల్ఈపీ సర్వేల్లో ఓటీపీ విధానం లేదని, ప్రస్తుతం కొత్తగా ఓటీపీలు తీసుకోవడంతో ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని తెలిపారు.పెన్షన్ పంపిణీ రోజునే వ్యాక్సినేషన్ కార్యక్రమాలు నిర్వహించడం వల్ల క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఒకవైపు వైద్యశాఖ, మరోవైపు గ్రామ, వార్డు సచివాలయ అధికారుల ఆదేశాలతో నిరంతరం పని చేస్తూ తీవ్ర ఒత్తిడికి గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.హెల్త్ సెక్రటరీలపై అదనపు పని భారం మోపకుండా తక్షణమే ఓటీపీ విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించి, అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సెక్రటరీ అసోసియేషన్ నాయకులు గోపిక, రోజా, కమల, రాణి, విజయకుమారి, సుధారాణి, శ్రీలత, నాగమణి, ప్రభావతి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల గడపకు పాలన.. సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం!

నందిగామ సెప్టెంబరు 11 (ప్రజా వీక్షణం )





ఎన్టీఆర్ జిల్లా నందిగామ: ప్రజలకు పాలనను మరింత చేరువ చేసి, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. నందిగామ పట్టణంలోని మధిర ఆర్చి రోడ్డులో ఉన్న ఆర్ఎస్ గార్డెన్స్‌లో నిర్వహించిన ప్రత్యేక స్నేహపూర్వక ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు.ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలేఖ్య, జిల్లా అధికార యంత్రాంగం, కూటమి నేతలతో కలిసి ప్రజల నుంచి సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి అధికారులతో చర్చించారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేలా ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ప్రజా వేదికలు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయని ఎమ్మెల్యే సౌమ్య పేర్కొన్నారు.గత ప్రభుత్వ హయాంలో ప్రజా సమస్యలు పరిష్కారం కాకుండా కార్యాలయాల చుట్టూ ప్రజలు తిరిగే పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత "ప్రజల వద్దకే పాలన.. ప్రజల సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం" అనే విధానంతో ముందుకు సాగుతోందని ఆమె తెలిపారు.నందిగామ నియోజకవర్గంలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు అధికార యంత్రాంగంతో నిరంతరం సమన్వయం చేసుకుంటున్నామని వెల్లడించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అందేలా చూడాలని అధికారులను కోరారు. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనకు పెద్దపీట వేస్తూ నందిగామ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య తెలిపారు.

## కంచికచర్ల మండల భారతీయ జనతా పార్టీ తరపున జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియ కి వినతి పత్రం

కంచికచర్ల సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం )

ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల పట్టణంలో గత 70 సంవత్సరాల నుంచి ప్రభుత్వానికి సంబంధించిన భూమిలో ఇల్లు స్థలాలు కట్టుకొని నివాసముంటున్నారు ఆ భూములు 22ఎ జబితా లో ఉన్నావి వాటికి -GO 30 ద్వారా ఇల్లు పట్టాలు జారిచేయవలసినదిగా కోరుచున్నాము వాటిపై ఎటువంటి అభ్యంతరాలు లేవని మా తరపున మీకు తెలియజేస్తున్నాము గత 50 సంవత్సరాల క్రితం కంచికచర్ల కొన్ని కాలనీలు ప్రభుత్వం తరపున నుంచి ఇవ్వడం జరిగింది వాటిని రిజిస్ట్రేషన్ చేసుకునే విధంగా noc జారిచేయివలననదిగా కోరుచున్నాము ఈ అర్జి పై రిపోర్ట్ తయారుచేసి లబ్ధిదారులకు త్వరగా న్యాయం చేయాల్సిందిగా కోరుచున్నాము జాయింట్ కలెక్టర్ ఇలక్కియ కి వినతి పత్రం అందజేసిన నాయకులు భారతీయ జనతా పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పోరుగండి నరసింహారావు కంచికచర్ల భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు కాలవ మహేష్ బాబు.



## ఘనంగా మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల సన్మాన మహోత్సవం..



## మండల విద్యాధికారి పి.బలరాం

దేవరకద్ర సెప్టెంబర్11 ప్రజా విక్షణం

డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా దేవరకద్ర మండల విద్యాధికారి పి.బలరాం ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం ఎంపీడీఓ సమావేశ మందిరంలో సుస్వాము శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ దమయంతి గోవర్ధన్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావు హాజరయ్యారు.ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది,విద్యార్థుల భవిష్యత్ మీ చేతిలో ఉంది. ఉపాధ్యాయుడే ఆదర్శం,మనలని చూసి విద్యార్థులు అనునయిస్తారు. నేటి సమాజంలో విద్యార్థి పెడదోవ పట్టకుండా సెల్ఫోన్ కు బానిస కాకుండా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని మండల విద్యాధికారి పి.బలరాం సూచించారు.విద్యార్థులే దేశ భవిష్యతు అని సంపూర్ణ మూర్తిమత్వ పౌరులుగా తీర్చదిద్దాల్సిన ఉపాధ్యాయులపై ఉంది. రమేష్ కోయిలసాగర్ ప్రధానోపాధ్యాయులు అన్నారు .ఉపాధ్యాయులను మనం మనమే గౌరవించుకోవాలని, నేను కూడా ఒక ఉపాధ్యాయురాలిగా పనిచేశానని ఇది నా కుటుంబం అని , ఈ సందర్భంగా సన్మానం పొందుతున్న ఉపాధ్యాయులు అందరికీ శుభాకాంక్షలు చైర్మన్ దమయంతి ఉపాధ్యాయ వృత్తిని ఎంచుకున్న రోజే మనందరం ఉత్తమ ఉపాధ్యాయులమని బాలికల కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు నాగేంద్రమ్మ తెలిపారు.సమాజంలో ఉన్న పౌరులందరినీ తీర్చిదిద్దేది ఉపాధ్యాయులే , నేటి బాలలే రేపటి పౌరులు. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది, గౌరవమైనది. మన ప్రభుత్వ పాఠశాలను కాపాడుకోవాలని అని మండల అభివృద్ధి అధికారి శ్రీనివాస్ రావుతెలిపారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ప్రాథమిక ,ప్రాథమికోన్నత , ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు,ఉపాధ్యాయులు మండల అధ్యక్షులు రఘువర్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు అశ్విని చంద్రశేఖర్, మండల ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య,అజయ్, జిల్లా నాయకులు వేణుగోపాల్ తపస్ మండల అధ్యక్షులు నాగేశ్వర్ రెడ్డి ప్రధాన కార్యదర్శి సుదర్శన్, గోనెల శ్రీధర్,ఊట ఉర్దూ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ సలాం, టీ యు టిఎఫ్ శంకర్,డీటీఫ్ జిల్లా బాధ్యులు సృజన, తదితరులు పాల్గొన్నారు

Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com

ప్రజావీక్షణం
దినపత్రిక
GENERAL NEWS
12 శనివారం సెప్టెంబర్ 2026
9
www.prajaveekshanam.in

# వినాయక చవితికి పర్మిషన్ తప్పనిసరి: ఎస్సై జయబాబు





## వినాయక చవితి ఉత్సవాలపై పోలీసుల ఆంక్షలు: విధిగా అనుమతులు తీసుకోవాలి!

## నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ ఐ జయబాబు హెచ్చరిక

**టి. నర్సాపురం:సెప్టెంబర్ 11(ప్రజా వీక్షణం)**

వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రశాంతంగా, ఎలాంటి గొడవలు లేకుండా జరుపుకోవాలని ఏలూరు జిల్లా టి. నర్సాపురం మండలం ఎస్సై జయబాబు తెలిపారు. పండుగ సందర్భంగా మండపాలు పెట్టేవారు కొన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, నిబంధనలు పాటించాలని ఆయన స్పష్టం చేశారు.వినాయక మండపాల వద్ద శాంతి భద్రతలకు విఘతం కలగకుండా నిర్వాహకులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే వినాయక మండపాలు పెట్టాలనుకునే వారు ఎవరైనా సరే, ఖచ్చితంగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు. మండపాల దగ్గర విద్యుత్ షాక్‌లు రాకుండా వైరింగ్ సరిగ్గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.అంతేకాకుండా ముఖ్యంగా రాత్రి సమయాల్లో పెద్ద పెద్ద శబ్దాలతో మైకులు, డీజేలు పెట్టకూడదు.మండపాల వద్ద అశ్లీల కార్యకమాలు, రెచ్చగొట్టే ప్రసంగాలు, వివాదాలకు దారితీసే చర్యలకు పాల్పడకూడదు అన్నారు. ట్రాఫిక్ కు అంతరాయం కలగకుండా వాహనాల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. నిమజ్జనం సమయంలో పోలీసుల నిబంధనలు కచ్చితంగా పాటించాలి. పండుగను ఎవరికీ ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మరియు పోలీసులకు అందరూ సహకరించాలని జయబాబు ఎస్సై కోరారు. అలాగే నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

# ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ ఎన్. శ్వేత

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 11(ప్రజా వీక్షణం న్యూస్)**

వార్షిక తనిఖీల్లో భాగంగా వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ శుక్ర వారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, కిట్ ఆర్టికల్స్‌ను పరిశీలించి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారులు--పాదచారుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రజలతో మర్యాదగా వ్యవహరించి మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ అదనపు డీసీపీ ప్రభాకర్ రావు, ఏసీపీ సత్యనారా యణ, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



# డ్రగ్స్ నిర్మూలనకు 'సంఘమిత్ర' బలమైన వారధి







**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం న్యూస్)**

హన్మకొండ జిల్లాలో పోలీస్--ప్రజల భాగస్వా మ్యంతో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం 'సంఘమిత్ర'ను శుక్రవారం కాళోజీ కళాక్షేత్రంలో ప్రారం భించారు. మహిళా స్వయం సహాయక సంఘా ల రిసోర్స్ పర్సన్స్, ఆఫీస్ బేరర్స్, మెప్మా సభ్యుల ద్వారా సుమారు 1.60 లక్షల మందికి డ్రగ్స్, గంజా యి దుష్పరిణామాలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం లక్ష్యమని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్ తెలి పారు. ప్రతి కుటుంబానికి డ్రగ్స్ వ్యతిరేక సందేశాన్ని తీసుకెళ్లాలని ఆమె కోరారు.హన్మకొండ కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ యువత ప్రవర్తనలో మార్పులను తల్లులు, కుటుంబ సభ్యు లు ముందుగానే గుర్తించి అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత డ్రగ్స్ వ్యసన లక్షణాలు, బాధితు లకు అందించాల్సిన సహాయం, పోలీసులకు సమాచారం అందించే విధానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమం లో అధికారులు, పోలీస్ సిబ్బంది, మహిళా సంఘా ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కార్మికుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటా

## మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్

**బోయినపల్లి; సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం)**

మేడ్చల్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ బోయినపల్లి సర్కిల్ డివిజన్ పరిధిలో నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఎల్లప్పుడూ అండగా ఉంటానని మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ హామీ ఇచ్చారు. తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ రంగాల కార్మికుల ట్రేడ్ యూనియన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని కార్మికులకు యూనియన్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ.. నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్మికుల సంక్షేమమే లక్ష్యంగా వారికి అందాల్సిన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా సహకరిస్తానని పేర్కొన్నారు. అలాగే కార్మికుల యూనియన్ కార్యాలయ ఏర్పాటుకు అవసరమైన స్థలాన్ని కేటాయించేలా కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కార్మికులు ఐక్యంగా ఉండి తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి యూనియన్ ఎంతో కీలకమని అన్నారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం యూనియన్ ప్రతినిధులతో కలిసి నిరంతరం పనిచేస్తానని స్పష్టం చేశారు.కార్మికుల సమస్యల పరిష్కారంలో తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, వారి కష్టసుఖాల్లో భాగస్వామిగా నిలుస్తానని ముద్దం నర్సింహ యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ నర్సింహులు, అధ్యక్షుడు వెంకటేశ్వర్ రావు, ప్రధాన కార్యదర్శి బాబూరావుతో పాటు యూనియన్ సభ్యులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.




# బేగంపేట పాదచారుల వంతెనపై ఇబ్బందులు.. పనిచేయని లిఫ్టులు, ఎస్కలేటర్లు

## -- వృద్ధులు, మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పని తిప్పలు.. రోడ్డుపై నుంచి ప్రాణాలకు తెగించి దాటుతున్న పాదచారులు

**బోయినపల్లి; సెప్టెంబర్ 11( ప్రజా వీక్షణం)**

నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన బేగంపేట ప్రధాన రహదారిపై పాదచారుల కోసం ఏర్పాటు చేసిన వంతెన (ఫుట్ ఓవర్ బ్రిడ్జి) నిర్వహణ లోపాలతో ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవు తున్నాయి. ముఖ్యంగా వంతెనకు ఇరువైపులా ఏర్పాటు చేసిన లిఫ్టులు, ఎస్కలేటర్లు పనిచేయకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు, మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న వారు మెట్లు ఎక్కేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బేగంపేట ప్రాంతంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చిన్నారులను తీసుకువచ్చే తల్లిదండ్రులు, మహిళా కళాశాలలో విద్యార్థినులను దింపేందుకు వచ్చే వారి తల్లిదండ్రులు ప్రతిరోజూ ఈ వంతెనను ఉపయోగించాల్సి వస్తోంది. అయితే లిఫ్టులు పనిచేయకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో పొడవైన మెట్లు ఎక్కి రహదారికి అవతలి వైపునకు చేరుకోవాల్సి వస్తోంది. దీంతో వృద్ధులు, చిన్నపిల్లల తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.రద్దీ రహదారిపై ప్రాణాలకు ముప్పు పాదచారుల వంతెన సౌకర్యవంతంగా అందుబాటులో లేకపోవడంతో కొంతమంది ప్రజలు నేరుగా బేగంపేట ప్రధాన రహదారిని దాటాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. నిత్యం వందలాది వాహనాలు వేగంగా రాకపోకలు సాగించే ఈ మార్గంలో వాహనాల మధ్య నుంచి రోడ్డు దాటడం ప్రమాదకరంగా మారింది. ఏ చిన్న పొరపాటు జరిగినా ప్రాణనష్టం సంభవించే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.వృద్ధులు, మహిళల పరిస్థితి మరింత దయనీయం లిఫ్టులు పనిచేయకపోవడంతో వృద్ధులు, మోకాళ్ల సమస్యలతో బాధపడుతున్న వారు మెట్లు ఎక్కలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహిళలు చిన్నారులను వెంటబెట్టుకుని మెట్లు ఎక్కడం కూడా కష్టంగా మారింది. ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పాదచారుల వంతెనే వారికి ఇబ్బందులకు కారణమవుతోందని స్థానికులు వాపోతున్నారు.



**-- నిర్వహణ లోపాలతో మరిన్ని సమస్యలు........**

హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో పాదచారుల వంతెనల నిర్వహణపై కూడా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. కొన్ని చోట్ల లిఫ్టులు, ఎస్కలేటర్లు సాంకేతిక సమస్యలతో నిలిచిపోతుండగా, మరికొన్ని ప్రాంతాల్లో వంతెనలపై చెత్తాచెదారం పేరుకుపోవడం, అపరిశుభ్రత, దుర్వాసన వంటి సమస్యలు నెలకొంటున్నాయి. దీంతో పాదచారులు వంతెనలను వినియోగించేందుకు ఆసక్తి చూపడం లేదని స్థానికులు చెబుతున్నారు.

**-- వెంటనే లిఫ్టులు పునరుద్ధరించాలని డిమాండ్.........**

బేగంపేట పాదచారుల వంతెనకు ఇరువైపులా ఉన్న లిఫ్టులు, ఎస్కలేటర్లను వెంటనే మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు, మహిళలు, వృద్ధులు కోరుతున్నారు. సంబంధిత జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి వంతెనను పరిశీలించి, సాంకేతిక లోపాలను పరిష్కరించడంతో పాటు నిరంతర నిర్వహణకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల ప్రాణ భద్రతకు సంబంధించిన అంశం కావడంతో ఇకనైనా అధికారులు నిర్లక్ష్యం వీడి బేగంపేట పాదచారుల వంతెనను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

# మహిళ అదృశ్యం కేసు దారుణ హత్యగా తేల్చిన పోలీసులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం న్యూస్)**

హసన్‌పర్తి పరిధిలో మే 15 నుంచి అదృశ్యమైన తౌటం స్వప్న (40) కేసును పోలీ సులు దారుణ హత్యగా ఛేదించారు. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేప ట్టిన పోలీసులు కర్ణాటకకు చెందిన వోద్దిరాజుల బసవ రాజ్ (27)ను నిందితుడిగా గుర్తించారు. పెళ్లి చేసుకోవా లని స్వప్న ఒత్తిడి చేయ డంతో, ఆమెను బళ్లారికి రప్పించి అడవిలో గొంతు పిసికి హత్య చేసినట్లు నిందితుడు విచారణలో అంగీకరించినట్లు పోలీ సులు తెలిపారు. మృతదే హాన్ని ముక్కలుగా చేసి అడవిలో పడేసి, ఫోన్‌ను చెరువులో పడేసినట్లు వెల్లడించారు. శుక్రవారం అంబాల--కమలాపూర్ రోడ్డులో వాహన తనిఖీల సందర్భంగా పోలీసులను చూసి పారిపోతుండగా బసవరాజ్‌ను హసన్‌పర్తి ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ సిబ్బందితో కలిసి అదుపు లోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి రియల్‌మీ ఫోన్ స్వాధీనం చేసుకుని, దీఎీా 103, 238 సెక్షన్ల కింద అరె స్ట్ చేసి రిమాండ్‌కు తరలిం చారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఉన్నతాధికారులు అభినందించారు.



ప్రజావీక్షణం
దినపత్రిక

# ఓల్డ్ బోయినపల్లిలో వన మహోత్సవంలో మొక్కల పంపిణీ

## -- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి: ముద్దం నర్సింహ యాదవ్

**బోయిన్‌పల్లి: సెప్టెంబర్ 11 (ప్రజా విక్షణం)**

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వన మహోత్సవం 2026--27 కార్యక్రమంలో భాగంగా హెచ్‌ఏఎల్ పార్క్ వద్ద మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఓల్డ్ బోయిన్‌పల్లి మాజీ కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పాల్గొని కాలనీవాసులు, విద్యార్థులకు వివిధ రకాల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముద్దం నర్సింహ యాదవ్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా, వాటిని క్రమం తప్పకుండా సంరక్షించి పెద్దవిగా పెంచినప్పుడే వన మహోత్సవం లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు విరివిగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటికీ ఒక మొక్క.. ప్రతి కాలనీకీ పచ్చదనం" అనే సంకల్పంతో ప్రజలు ముందుకు రావాలని ఆయన కోరారు. ముఖ్యంగా విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని తమ కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారిని కూడా మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని సూచించారు. మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను కూడా తీసుకోవడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించవచ్చని తెలిపారు. కాలనీల్లో విస్తృతంగా మొక్కలు నాటడం వల్ల స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూబీడీ సూపర్వైజర్ గణేష్, రాంబాబు, కాలనీవాసులు, విద్యార్థులు తదితరులు పాల్గొని మొక్కలను స్వీకరించారు.



# తిరుపతిలో పోయిన మొబైల్‌ను రికవరీ చేసిన హసన్‌పర్తి పోలీసులు

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం న్యూస్)**

తిరుపతిలో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్‌ను CEIR సాంకేతికత సహాయంతో హసన్‌పర్తి పోలీసులు రికవరీ చేసి బాధితుడికి అప్పగించారు. మే 30న ఎన్. ప్రశాంత్ తన మొబైల్ ఫోన్‌ను తిరుపతిలో పోగొ ట్టుకున్నాడు. దీనిపై హసన్ పర్తి పోలీస్ స్టేషన్ CEIR ఆపరేటర్ ఎం. సోమన్న క్రైమ్ పార్టీ కె. తిరుపతి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో మొబైల్ ఫోన్ తిరుపతిలో ఉన్నట్లు గుర్తించి, ప్రత్యేక శ్రద్ధతో కొరియర్ ద్వారా హసన్ పర్తి పోలీస్ స్టేషన్‌కు తెప్పించారు. అనంతరం శుక్రవారం ఇన్‌స్పెక్టర్ ఎ. మహేందర్ బాధితుడు ప్రశాంత్‌కు మొబైల్‌ను అందజేశారు. ఫోన్‌ను రికవరీ చేసిన పోలీసులకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.



# భద్రకాళి ఆలయం నుంచి బండ్ ఐలాండ్ వరకు రోప్‌వే

## ప్రీ-బిడ్డింగ్ సమావేశంలో వివిధ అంశాలపై చర్చ

**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం న్యూస్)**

కుడా పరిధిలో పర్యాటక అభివృద్ధికి మరో ముంద డుగు పడనుంది. భద్రకాళి ఆలయం నుంచి చెరువు ఐలాండ్ వరకు బండ్ కనె క్టివిటీతో రోప్‌వే నిర్మాణం చేపట్టేందుకు చర్యలు ప్రారంభించారు. రోప్‌వే నిర్మాణానికి సంబంధించి శుక్రవారం కుడా కార్యాల యంలో జిల్లా కలెక్టర్, కుడా వైస్ చైర్‌పర్సన్ చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన ప్రీ–బిడ్డింగ్ సమావేశం నిర్వహించారు. బిడ్డింగ్ దాఖలు చేసేందుకు అదా నీ, ఉషా బ్రేక్‌ఓవర్, సీఎస్ ఆర్‌ఎల్, గజానన కంపెనీ లు ముందుకు వచ్చినట్లు అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా రోప్‌వే నిర్మా ణానికి సంబంధించిన వివిధ అంశాలపై కలెక్టర్, కుడా అధికారులు, ఆయా కంపెనీల ప్రతినిధులు చర్చించారు. ప్రాజెక్టు అమ లు, సాంకేతిక అంశాలు తదితర విషయాలపై అభి ప్రాయాలను పంచుకున్నా రు. సమావేశంలో కుడా పీఓ అజిత్‌రెడ్డి, ఈఈ భీమ్‌రావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంజయ్య నగర్‌లో స్థానికులతో మాజీ కార్పొరేటర్ సమావేశం





## -- సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడిన ముద్దం నర్సింహ యాదవ్

**బోయినపల్లి; సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం)**

ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే లక్ష్యంగా ప్రజల మధ్యకు వెళ్లాలని మాజీ కార్పొరేటర్ శ్రీ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా అంజయ్య నగర్‌లో స్థానిక ప్రజలతో సమావేశమై కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కాలనీలో ఎదుర్కొంటున్న పలు సమస్యలను మాజీ కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా మురుగు కాలువల సమస్య, పారిశుద్ధ్య లోపాలు, తాగునీటి ఇబ్బందులు, వీధి విద్యుత్ దీపాల సమస్యలు, సీసీ కెమెరాల ఏర్పాటు వంటి అంశాలను వివరించారు. అలాగే కాలనీలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసుల గస్తీని మరింత పెంచాలని కోరారు. స్థానికులు వివరించిన సమస్యలపై ముద్దం నర్సింహ యాదవ్ స్పందిస్తూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ముఖ్యంగా పారిశుద్ధ్యం, మురుగు కాలువలు, తాగునీరు, వీధి దీపాల వంటి ప్రాథమిక సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, అంజయ్య నగర్‌లో అసాంఘిక కార్యకలాపాలకు తావులేకుండా నిరంతరం పోలీసు గస్తీ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. అవసరమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా భద్రతను మరింత పటిష్టం చేయాలని పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారానికి కృషి చేస్తానని ముద్దం నర్సింహ యాదవ్ తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, రాములు, మధుకర్, శ్రీను, రాజు, రాజయ్య, ఐలేష్, భూమేష్, టిటు, కళ్యాణి, అలివేలు, పుష్పమ్మ, కొమురవ్వ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి వినాయకులను పూజిద్దాం..









## పర్యావరణాన్ని కాపాడుదాం.. సుజాత విద్యానికేతన్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆకుతోట శాంతారాం కర్ణ






**ఉమ్మడి వరంగల్ జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం న్యూస్)**

పర్యావరణ పరిరక్షణలో భాగంగా హసన్‌పర్తిలోని సుజాత విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో గత 30 ఏళ్లుగా మట్టి వినాయ క విగ్రహాలను తయారు చేసి ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 30 వేల మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆకు తోట శాంతారామ్ కర్ణ తెలి పారు.ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రసాయన రంగులతో తయారైన విగ్రహాల నిమజ్జ నం వల్ల జల కాలుష్యం, జలచరాలకు హాని కలుగు తుందని పేర్కొంటూ "మట్టి వినాయకులను పూజిద్దాం పర్యావరణాన్ని కాపాడు దాం" అనే సందేశంతో ప్రజ ల్లో అవగాహన కల్పిస్తు న్నారు. ప్రతి కుటుంబం మట్టి వినాయకుడిని పూజించాలని, యువతకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించాలని కోరారు. పాఠశాల పర్యావ రణ మిత్ర ఎన్‌జీసీ యూని ట్ ఆధ్వర్యంలో గత 33 ఏళ్లుగా మొక్కలు నాట డం, జల సంరక్షణ, ప్లాస్టిక్ నిషేధం, కాలుష్య నివారణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపా రు. వనమహోత్సవంలో భాగంగా సుమారు 30 వేల మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతను విద్యార్థులకు అప్పగించినట్లు వెల్లడిం చారు. పర్యావరణ పరిర క్షణ కార్యక్ర మాలకు జాతీ య, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పలు అవార్డులు అందుకు న్నామని, 2011 నుంచి 2016 వరకు వరుసగా ఆరుసార్లు జాతీయస్థాయి లో పర్యావరణ మిత్ర అవా ర్డులు పొందినట్లు పాఠశాల ప్రతినిధులు తెలిపారు. మట్టి వినాయకులను పూజించి పర్యావరణాన్ని పరిరక్షించాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు.

# దయ చూపండి.. మా సమస్యలు పరిష్కరించండి

## - రైస్ మిల్లర్స్ అధికారులకు గోడు

## - రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కు వినతి



**భద్రాద్రి కొత్తగూడెం, సెప్టెంబర్ 11(ప్రజా వీక్షణం):**

ధాన్యం మిల్లింగ్ నిలిపివేత బిల్లింగ్ సమయంలో ఏర్పడిన తరుగు ఎఫ్ సి ఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి సానుకూల నిర్ణయం తీసుకోవాలని రైస్ మిల్లుల అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ బిల్లింగ్ ప్రక్రియలో ట్రాన్స్పోర్ట్ నూకలు ఇతర తరుగుదలలు కలిపి సుమారు 15 శాతం నుండి 20 శాతం వరకు తరుగు వస్తుందని ఈ తరుగుదలను ఫిజికల్ వెరిఫికేషన్ సమయంలో సరైన విధంగా తీసుకోకపోవడం వల్ల రైస్ మిల్లర్స్ కు తీవ్ర ఆర్థిక నష్టం కలుగుతుందని ఈ కారణంగా ప్రస్తుతం మిల్లింగ్ ప్రక్రియ కొనసాగించడం ఆర్థికంగా సాధ్యం కానీ పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎఫ్సీఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరించకుండా రా రైస్ మాత్రమే ఇవ్వాలని సూచిస్తున్నప్పటికీ మిల్లులకు కేటాయించబడుతున్న ధాన్యం రా రైస్ తయారీకి అనుకూలంగా లేకపోవడం వల్ల దానిని రా రైస్ గా మిల్లింగ్ చేసి సరఫరా చేయటం సాధ్యం కాని పని పరిస్థితి నెలకొందని పేర్కొన్నారు. పై సమస్యలకు తగిన పరిష్కారం లభించే వరకు మిల్లింగ్ కార్యక్రమాలు నిలిపివేయాలని జిల్లా రైస్ మిల్ అసోసియేషన్ నిర్ణయించుకుందని స్పష్టం చేశారు. సమస్యలపై సానుకూలంగా పరిశీలించి రైస్ మిల్లర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను తగిన పరిష్కారం చూపటంతో పాటు ఎఫ్ సి ఐ ద్వారా బాయిల్డ్ రైస్ స్వీకరణ మిల్లింగ్ కు సంబంధించిన ఇతర సమస్యలను పరిష్కరించే విధంగా అధికారుల చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు జుగల్ కిషోర్ ఖండేల్వాల్, సెక్రటరీ శ్రీనివాస రెడ్డి, ట్రెజరర్ పల్లపోతు శ్రీనివాసు, వెంకటేశ్వర రెడ్డి, కంచర్ల శ్రీనివాసు జిల్లా రైస్ మిల్లు ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కోనేరు పుష్కరిణి ఆక్రమణలు తొలగించాలి

## ఐదో రోజుకు చేరిన హిందూ సంఘాల రిలే నిరాహార దీక్షలు

## తక్షణమే చర్యలు తీసుకోకపోతే ఉద్యమం ఉధృతం చేస్తాం

**నందిగామ సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం )**

ఎన్టీఆర్ జిల్లా నందిగామ: పట్టణంలోని రామలింగేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న స్వామివారి కోనేరు పుష్కరిణి ఆక్రమణలను తొలగించాలని డిమాండ్ చేస్తూ హిందూ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి.శుక్రవారం రిలే నిరాహార దీక్షలో కుంచెం లక్ష్మీనారాయణ, నూతక్కి విజయ్, నామన శ్రీబాబు కూర్చున్నారు. వారికి హిందూ సంఘాల సభ్యులు ఈవూరి సురేష్, తొర్లికొండ సీతారామయ్య దండలు వేసి దీక్షకు మద్దతు తెలిపారు. దీక్షకు నకరికంటి నరేష్, అనుములు పార్థసారథి, వల్లభనేని శ్రీనివాసరావు, నెలకొదిటి మస్తాన్‌రావు తదితరులు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా హిందూ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. రామలింగేశ్వర స్వామివారి కోనేరు పుష్కరిణి ఆక్రమణలను తొలగించాలని కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అధికారులు చర్యలు చేపట్టకుండా రోజుకో మాట చెబుతూ జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. ఆక్రమణల తొలగింపుపై అధికారులు నిర్లక్ష్య వైఖరి అవలంబించడం వెనుక కారణాలు ఏమిటో అర్థం కావడం లేదన్నారు.కోనేరు పుష్కరిణి ఆక్రమణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అధికారుల నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ దీక్షా శిబిరం వద్ద నినాదాలు చేశారు.రిలే నిరాహార దీక్షలకు స్వచ్ఛంద సంస్థల సభ్యులు, హిందూ సంఘాలు, మహిళా సంఘాల ప్రతినిధులు మద్దతు తెలిపారు.




# వినాయక మండపాల్లో భద్రతా జాగ్రత్తలు తప్పనిసరి

## నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవు

## తాడేపల్లిగూడెం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు హెచ్చరిక

**తాడేపల్లిగూడెం ప్రతినిధి సెప్టెంబర్ 11 (ప్రజా వీక్షణం)**

వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు మండపాల నిర్వాహకులు పోలీసుల సూచనలు, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని తాడేపల్లిగూడెం రూరల్ సీఐ బి.శ్రీనివాసరావు సూచించారు. సర్కిల్ పరిధిలోని మండపాల నిర్వహకులతో శుక్రవారం రాత్రి రూరల్ ఎస్సై ఎస్.రవి కుమార్ అధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ మండపాల ఏర్పాటుకు ముందస్తు అనుమతులు తీసుకోవడంతో పాటు భక్తులు, ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మండపాల ఏర్పాటుతో ప్రజల రాకపోకలకు, వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ వైరింగ్ విషయంలో నాణ్యమైన వైర్లు, పరికరాలను మాత్రమే వినియోగించాలని, షార్ట్‌సర్క్యూట్ వంటి ప్రమాదాలు జరగకుండా విద్యుత్ సిబ్బంది సూచనలు పాటించాలని తెలిపారు. మండపాల వద్ద తప్పనిసరిగా అగ్నిమాపక భద్రతా చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితుల్లో భక్తులు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు తగినంత స్థలం ఉండేలా చూసుకోవాలని చెప్పారు.రాత్రి వేళల్లో మండపాల వద్ద నిర్వాహకులు భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. లౌడ్‌స్పీకర్లు, డీజేల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలు, పోలీసుల సూచనలు పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా అధిక శబ్దం చేయరాదని సూచించారు. వినాయక విగ్రహాల ఊరేగింపు సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులతో సమన్వయం చేసుకోవాలని,



ఎలాంటి అశ్లీల నృత్యాలకు తావులేకుండా నిర్వాహకులు బాధ్యతగా వ్యవహరించాలని సీఐ సూచించారు. మండపాల వద్ద మహిళలు, చిన్నారులు, వృద్ధులు, దివ్యాంగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. అనుమానాస్పద వస్తువులు, వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. వినాయక చవితి వేడుకలను ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా నిర్వహిస్తూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని సీఐ కోరారు. నిబంధనలు ఉల్లంఘించి ప్రజల భద్రతకు ముప్పు కలిగించే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ ఓవి సురేష్, హోంగార్డులు రమణ, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు జాతీయ ప్రోత్సాహక దినోత్సవం




జాతీయ ప్రోత్సాహక దినోత్సవాన్ని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 12న.నిర్వహిస్తారు. ఈ రోజు మన చుట్టూ ఉన్న ప్రజలను ఉత్తేజపరిచేందుకు మరియు సానుకూల ప్రభావాన్ని చూపడానికి ఈరోజు నెలకొల్పబడింది.అర్కాన్సాస్‌లోని సియర్సీలోని హార్డింగ్ విశ్వవిద్యాలయంలోని ప్రోత్సాహక ఫౌండేషన్ ప్రోత్సాహక దినోత్సవం వెనుక ఈ ప్రయత్నాన్ని ప్రారంభించింది. అర్కాన్సాస్‌లోని సియర్సీ మేయర్ బెలిండా లాఫోర్స్ ఆగస్టు 22, 2007న ప్రోత్సాహక దినోత్సవం కోసం మొదటి ప్రకటన చేశారు. మరుసటి నెలలో, అర్కాన్సాస్ గవర్నర్ మైక్ బీబే సెప్టెంబర్ 12, 2007ను అర్కాన్సాస్‌కు "రాష్ట్ర ప్రోత్సాహక దినోత్సవం"గా ప్రకటిస్తూ ఒక ప్రకటనపై సంతకం చేశారు.తరువాత, అధ్యక్షుడు జార్జ్ డబ్ల్యూ. బుష్ కూడా సెప్టెంబర్ 12వ తేదీని అధికారిక జాతీయ ప్రోత్సాహక దినోత్సవంగా ప్రకటిస్తూ ఒక సందేశంపై సంతకం చేశారు. భవిష్యత్తులో జాతీయ ప్రోత్సాహక దినోత్సవంలో మరిన్ని రాష్ట్రాలను భాగస్వామ్యం చేయడానికి ప్రోత్సాహక ఫౌండేషన్ ప్రణాళికలు రూపొందిస్తోంది.ఒక విద్యార్థి, సహోద్యోగి లేదా స్నేహితుడికి స్ఫూర్తినిచ్చే కొన్ని మాటలు చెప్పడం వల్ల మనకు ఎటువంటి ఖర్చు ఉండదు. ఒక అపరిచితుడికి ఒక భరోసా ఇచ్చే మాట కూడా వారి జీవితాల్లో మార్పు తీసుకురావచ్చు. ఎవరైనా నిరాశలో ఉన్నప్పుడు ప్రోత్సాహం వారిని పైకి లేపుతుంది. లక్ష్యంపై దృష్టి పెట్టే వ్యక్తిని కూడా ఇది ప్రేరేపిస్తుంది. మనం విఫలమైనప్పుడు, సరైన మాటలు ప్రయత్నిస్తూనే ఉండాలని గుర్తు చేస్తాయి. సరైన సందేశం ప్రియమైన వ్యక్తి దృక్పథాన్ని మార్చే ఒక స్పార్క్‌ను సృష్టించవచ్చు. కొన్నిసార్లు, బాగా చేసిన పనిని గమనించడం అనేది ఒకరి రోజును మెరుగుపరుస్తుంది. కొత్త ప్రతిభను గుర్తించే అలవాటును పెంపొందించుకోవడం వల్ల మనం మాట్లాడటానికి, దయగల మాట లేదా సహాయకరమైన చిట్కాను అందించడానికి ప్రేరేపిస్తుంది. పనిలో, ఇంట్లో మన చుట్టూ ఉన్న ప్రపంచంలో సంబంధాలను మెరుగుపరచుకోవడం విలువైన అభ్యాసం. నిజంగా అంత తేలికైన మార్గం లేదు. మీ చుట్టూ ఉన్న ప్రజలకు భరోసా మరియు ప్రేరణను అందించండి.బాగా చేసిన పనికి ఎవరికైనా హై ఫైవ్ ఇవ్వండి.ఒక స్నేహితుడు కష్టపడి సాధించుకున్న లక్ష్యాన్ని చేరుకుంటున్నప్పుడు గమనించండి, వారిని ముందుకు సాగమని ప్రోత్సహించండి.ఇబ్బంది పడుతున్న కుటుంబ సభ్యునికి కార్డు పంపండి లేదా కాల్ చేయండి లేదా టెక్స్ట్ చేయండి.స్నేహితుడి ప్రదర్శన, క్రీడా కార్యక్రమం లేదా ప్రదర్శనకు హాజరు కావడం ద్వారా మీ మద్దతును తెలియజేయండి.

# నూతన బీటీ రోడ్డుతో గ్రామీణ రవాణాకు మహర్దశ

## కూటమి ప్రభుత్వ పాలనలో రహదారుల అభివృద్ధికి పెద్దపీట .. రూ.1.10 కోట్లతో 4.2 కి.మీ.

## రహదారి అభివృద్ధి ప్రారంభించిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

**వీరులపాడు సెప్టెంబర్ 11 ( ప్రజా వీక్షణం )**

ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం, జమ్మవరం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పిస్తోందని ప్రభుత్వ విప్,ఎమ్మెల్యే శ్రీమతి తంగిరాల సౌమ్య అన్నారు.వీరులపాడు మండలం : జమ్మవరం గ్రామంలో కూటమి నేతలతో కలిసి గండేపల్లి నుంచి రంగాపురం వరకు నిర్మించిన నూతన బీటీ రోడ్డును ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ప్రారంభించారు. రూ.110 లక్షల అంచనా వ్యయంతో 4.200 కిలోమీటర్ల మేర ఆర్‌అండ్‌బీ రహదారిని అభివృద్ధి చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో రహదారి పరిస్థితుల కారణంగా ప్రజలు, రైతులు, వాహనదారులు ఎదుర్కొన్న ఇబ్బందులకు పరిష్కారం చూపే దిశగా ఈ రహదారి అభివృద్ధి ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. గండేపల్లి--రంగాపురం మార్గం అభివృద్ధి కావడం ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ప్రయాణ సౌకర్యం మెరుగుపడి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు కూడా ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ లక్ష్యం కేవలం హామీలు ఇవ్వడం కాదు.. ప్రజలకు కనిపించేలా అభివృద్ధి పనులు చేసి చూపించడమేనని సౌమ్య పేర్కొన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా మౌలిక వసతుల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, నందిగామ నియోజకవర్గంలో కూడా రహదారులు, తాగునీరు, సాగునీరు, వైద్యం తదితర రంగాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు.ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారుల అభివృద్ధికి నిరంతరం కృషి



చేస్తూ.. నందిగామ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య స్పష్టం చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు, ఆర్‌అండ్‌బీ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వినాయక విగ్రహాల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరి

## విగ్రహాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో సమాచారం అందించాలి. నిబంధనలకు లోబడి ఉత్సవాలు నిర్వహించాలి: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ

**ప్రజా వీక్షణం ,గోదావరిఖని:**

వినాయక చవితి పండుగ సందర్భంగా రామగుండము పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ఉత్సవాలు నిర్వహించాల నుకునే వారు తప్పనిసరిగా పోలీస్ శాఖ అనుమతి పొందాలని రామగుం డము పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ తెలిపారు.వినాయక విగ్ర హాల ఏర్పాటుకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఇందుకోసం https://policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి దరఖాస్తుదారుని వివరాలు,విగ్రహం ఏర్పాటు చేసే ప్రదేశం,ఆ ప్రదేశం ఏ పోలీస్ స్టేషన్ పరిధిలోకి వస్తుందో, విగ్రహం ఎత్తు, మండపం ఎత్తు, కమిటీ సభ్యుల పేర్లు,వారి ఫోన్ నంబర్లు,విగ్రహాన్ని ప్రతిష్ఠించే తేదీ, నిమజ్జనం చేసే తేదీ, సమయం,ప్రదేశం, నిమజ్జనం చేసే ప్రదేశానికి చేరుకునే వాహనం వివరాలను నమోదు చేయాలి.అదేవిధంగా మండప నిర్వాహకులు, గణపతి ఉత్సవ కమిటీ సభ్యులు, వాలంటీర్ల పేర్లు, ఫోన్ నంబర్లు, చిరునామా తదితర వివరాలను కూడా పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని పట్టణాలు,గ్రామాల్లో ఏర్పాటు చేసే గణపతి మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా వెబ్‌సైట్‌లో తమ వివరాలను నమోదు చేయాలని కమిషనర్ సూచించారు. ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేయడంలో ఇబ్బందులు ఎదురైతే సమీపంలోని పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని ఉత్సవ కమిటీ సభ్యులు మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్ఠాపనకు ప్రాధాన్యత ఇవ్వాలని కమిషనర్ సూచించారు. ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా కమిషనరేట్ పోలీస్ యంత్రాంగం 24 గంటలు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉంటుందని, అత్యవసర సమయంలో వెంటనే డయల్ 112కు సమాచారం అందించాలని తెలిపారు.

ప్రజావీక్షణం
దినపత్రిక

# మహిళలే తాళి ఎందుకు ధరించాలి?



ఫస్ట్ మూవీ సొంతంతో సూపర్ సక్సెస్ అందుకున్న హీరోయిన్ నమిత... ఆ తర్వాత స్టార్ హీరోస్ సరసన నటించారు. పెళ్లి తర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఈమె... వివాహా సంప్రదాయాలు, మహిళలపై సమాజంలో మోపుతున్న బాధ్యతలు, వివక్షల గురించి ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. అసలు పురుషులకు లేని నిబంధనలు మహిళలకే ఎందుకని ప్రశ్నించారు నమిత. 'ఆడవాళ్లే ఎందుకు బొట్టు పెట్టుకోవాలి? మహిళలే తాళి ఎందుకు ధరించాలి? పురుషులకు లేని రూల్స్ మహిళలకే ఎందుకు?' అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు. అలాగే, భర్త దీర్ఘాయుష్షు కోసం మహిళలు వరలక్ష్మి వ్రతం చేసే విధానంపైనా నమిత రియాక్ట్ అయ్యారు. నా భర్త సురక్షితంగా దీర్ఘాయుష్షుతో ఉండాలని నేను ఉపవాసం ఉంటాను. కానీ, నా భార్య క్షేమం కోసం భర్త కనీసం ఏడాదిలో ఒక్క రోజైనా కేటాయించాలనే రూల్ ఉందా? సమాజం ఎందుకు అలాంటివి క్రియేట్ చేయలేదు. కట్టు, బొట్టూ విషయంలో అన్నీ రూల్స్ మహిళలకే ఎందుకు? మహిళలు తాళి ధరించాలని ఏ గ్రంథాల్లోనూ లేదు. ఇవన్నీ సమాజం సృష్టించనవే. ఎందులోనూ ఇలాంటి నిబంధనలు లేవు.' అంటూ చెప్పారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'సొంతం' సినిమాతో టాలీవుడ్?లోకి ఎంట్రీ ఇచ్చిన నమిత తనదైన అందం, నటనతో మంచి ఫేమ్ సంపాదించుకున్నారు. ఆ తర్వాత విక్టరీ వెంకటేశ్‌తో జెమినీ చేశారు. రవితేజ, బాలకృష్ణ, శ్రీకాంత్ వంటి స్టార్స్‌తో కలిసి నటించారు. తెలుగుతో పాటు తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ మూవీస్ చేశారు. 2017లో పెళ్లి తర్వాత సినిమాలకు దూరమయ్యారు. చివరగా 2020లో మియా అనే తమిళ మూవీలో నటించారు. రీసెంట్‌గా సోషల్ మీడియాలో యాక్టివ్ అవుతున్నారు. మళ్లీ ఆమె మూవీస్‌లో నటిస్తారనే ప్రచారం సాగుతోంది. అయితే, దీనిపై నమిత అఫీషియల్‌గా రియాక్ట్ కాలేదు.




# నేడు 'ఆదర్శ కుటుంబం' టీజర్ విడుదల

విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కలయికలో వస్తున్న 'ఆదర్శ కుటుంబం' (హౌస్ నంబర్: 47) సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా కోసం ఎదురుచూస్తున్న వారికి చిత్ర యూనిట్ ఒక అదిరిపోయే అప్‌డేట్ ఇచ్చింది. ఈ మూవీ అధికారిక టీజర్‌ను రేపు (శనివారం) మధ్యాహ్నం 12 గంటలకు విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా ద్వారా అధికారికంగా ప్రకటించింది. ఈ చిత్రంలో వెంకటేష్ సరసన 'కేజీఎఫ్' ఫేమ్ శ్రీనిధి శెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా, నారా రోహిత్, నివేదా పేతురాజ్, రావు రమేశ్, వెన్నెల కిషోర్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ఎస్.ఎస్. థమన్ సంగీతం అందిస్తున్నారు. గతంలో వెంకటేష్ హీరోగా నటించిన క్లాసిక్ హిట్స్ 'నువ్వు నాకు నచ్చావ్', 'మల్లీశ్వరి' చిత్రాలకు త్రివిక్రమ్ మాటలు అందించిన సంగతి తెలిసిందే. ఆ చిత్రాల్లోని సంభాషణలు, వెంకటేష్ కామెడీ టైమింగ్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మళ్లీ ఇన్నాళ్లకు వీరిద్దరి కాంబినేషన్‌లో పూర్తిస్థాయి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ వస్తుండటంతో సినిమాపై విపరీతమైన క్రేజ్ నెలకొంది. ఈ చిత్రాన్ని గాంధీ జయంతి సందర్భంగా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేసేందుకు నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. తాజా అప్‌డేట్‌తో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.

# జూనియర్ ఎన్టీఆర్ డాన్స్ అంటే ఇష్టం

ఒకప్పుడు తన అందంతో కుర్రాళ్లను కవ్వించిన భామల్లో రంభ ఒకరు. ఆమె అందం నటన ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. అప్పట్లో స్టార్ హీరోల సరసన నటించింది మిప్పించింది. తన అందంతో ఇండస్ట్రీని ఊపేసింది. సినిమాలో హీరోయిన్ గా చేస్తూనే మరో వైపు స్పెషల్ సాంగ్స్ లోనూ మెప్పించింది రంభ. అందం అభినయంతో ఉర్రుతలూగించిన రంభ ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటున్నారు. రంభ గతంలో ఓ ఇంటర్వ్యూలో చేసిన కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. ఈ ఇంటర్వ్యూలో తన కెరీర్, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను ప్రేక్షకులతో పంచుకున్నారు. అలాగే జూనియర్ ఎన్టీఆర్ గురించి కొన్ని ఆసక్తికర కామెంట్స్ చేశారు రంభ. యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. మొన్నటి వరకు టాలీవుడ్ స్టార్ హీరోగా రాణించిన తారక్, ట్రిపుల్ ఆర్ సినిమాతో పాన్ ఇండియా స్టార్‌గా ఎదిగారు. ఇప్పుడు తారక్‌కు ప్రపంచవ్యాప్తంగా అభిమానులున్నారు. ఆయన డాన్స్‌లకు సపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. టాలీవుడ్‌లో బెస్ట్ డాన్సర్ ఎవరంటే ఎన్టీఆర్ పేరే చెబుతారు. ఎన్టీఆర్ డాన్స్ గురించి ఇప్పటికే చాలామంది సెలబ్రిటీలు ప్రశంసించారు. అలాగే నటి రంభ కూడా తారక్ డాన్స్ పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఆమె ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, జూనియర్ ఎన్టీఆర్ నటన అంటే ఎంతో ఇష్టమని తెలిపింది. తాను చేసిన ఐటెం సాంగ్స్ లో నాచోరే నాచోరే సాంగ్ అంటే ఇష్టమని రంభ చెప్పింది. ఎన్టీఆర్ డాన్స్ చేస్తే కన్నార్పకుండా చూస్తామని, ఆయన డెడికేషన్ చూస్తే పిచ్చెక్కుతుందని ఆమె పేర్కొంది. తన దృష్టిలో మైకేల్ జాక్సన్ కన్నా తారక్ బెస్ట్ డాన్సర్ అని రంభ ప్రశంసలతో ముంచెత్తింది. ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. రంభ మహేష్ బాబు, పవన్ కళ్యాణ్ లతో సినిమా చేయాలనే తన కోరికను కూడా బయటపెట్టింది.



# 'మహేంద్రగిరి వారాహి' సస్పెన్స్ థ్రిల్లర్

టాలీవుడ్ నటుడు సుమంత్ ఇటీవల అనగనగా, న్యూటన్ థర్డ్ లా వంటి సినిమాలతో మంచి సక్సెస్ అందుకున్నారు. అదే జోష్?లో ఆయన తాజాగా మహేంద్రగిరి వారాహి సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చారు. దేవుడు, దెయ్యాలపై ఏ మాత్రం నమ్మకంలేని సిద్ధార్థ్ (సుమంత్) తన యూట్యూబ్ ఛానెల్?తో ప్రజకలను చైతన్యవంతులను చేస్తుంటాడు. అందులో మూఢ నమ్మకాల ప్రచారంతో జనాలను దోచుకునే బురిడీ బాబాల బండారాలకు సంబంధించిన వీడియోలు తన యూట్యూబ్ ఛానెల్?లో పోస్టు చేస్తుంటాడు. అయితే తన సోదరుడు రాజీవ్ (కమల్ కామరాజు)కి పెళ్లి ఖాయం అవుతుంది. కానీ, అతడి జాతకంలో అపమృత్యు దోషం ఉందని, వారాహి అమ్మవారికి పూజలు చేస్తే అది తొలగిపోతుందని చెప్తారు. ఇందుకోసం అతడు విజయనగరంలోని మహేంద్రగిరి ఆలయానికి వెళ్తారు. పూజలు పూర్తయ్యాక రాజీవ్‌తో పాటు ఆ మహేంద్రగిరి రాజ వంశీకుడు నాగేంద్రవర్మ (వంశీ చాగంటి) కన్నుమూస్తారు. దీంతో గత 150ఏళ్లుగా ఆ కుటుంబంలో పుట్టిన మగబిడ్డ ఎవరైనా 33వ పుట్టినరోజునే మరణిస్తారన్న ఆసక్తికర విషయం సిద్ధార్థ్‌కి తెలుస్తుంది. ఆ కుటుంబానికి వారాహి అమ్మవారి శాపంతోనే అలా జరుగుతుందని ఊళ్లో నమ్ముతారు. దీంతో ఆ మరణాల వెనుకు ఉన్న రహస్యాన్ని ఛేదించేందుకు సిద్ధార్థ్ రంగంలోకి దిగుతాడు. ఆ తర్వాత ఏం జరిగింది? అది అమ్మవారు శపమేనా? అసలు సిద్ధు అన్న చావుకి, మహేంద్రగిరి వంశానికి ఉన్న సంబంధం ఏంటి? అనేది బిగ్?స్క్రీన్?పై చూసి తెలుసుకోవాల్సిందే! మహేంద్రగిరి సంస్థానంలోని ఒక రాజవంశం చేసిన పొరపాటు వల్ల, వారాహి అమ్మవారి ఆగ్రహానికి గురై ఆ కుటుంబంలోని మగవాళ్లంతా 33వ పుట్టినరోజు నాడే చనిపోతుంటారు. దీంతో ఇది 'మురారి' సినిమాను గుర్తు చేస్తుంటుంది. కానీ ఇందులో ప్రతీకార నేపథ్యం కథకు కొత్త లుక్ తెచ్చింది. సిద్ధు జొన్నలగడ్డ పాత్ర చుట్టూ నడిచే డ్రామా, హీరో ఫ్యామిలీ మహేంద్రగిరిలో అడుగుపెట్టాక వచ్చే ట్విస్ట్‌లు తో డైరెక్టర్ సంతోష్ ఈ మూవీని చాలా గ్రిప్పింగ్‌గా, వేగంగా ముందుకు నడిపించారు. ఇక ప్రీ ఇంటర్వెల్ సీన్స్?తో కథ ఆసక్తికరంగా మారుతుంది.

# విభిన్న పాత్రలను ఎంచుకుంటా

తెలుగుతో పాటు బాలీవుడ్‌లో విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ దూసుకుపోతున్న ప్రముఖ నటి రకుల్ ప్రీత్ సింగ్, తాజాగా తన కెరీర్ ఆకాంక్షలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తన సినీ ప్రయాణంలో ఇప్పటివరకు పూర్తి స్థాయి, హృదయాలను హత్తుకునే ఇంటెన్స్ లవ్ స్టోరీలో నటించలేదని, అలాంటి ఎమోషనల్ రొమాంటిక్ డ్రామాలో నటించాలనే బలమైన కోరిక ఉందని వెల్లడించారు. అలాగే చారిత్రాత్మక నేపథ్యం ఉన్న పీరియడ్ డ్రామాలు లేదా హర్రర్ జోనర్‌లలో ఇప్పటివరకు భాగం కాలేదని, ఆ జోనర్లలో కూడా విభిన్నమైన ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, నటిగా తనలోని సామర్థ్యాన్ని సవాల్ చేసే స్క్రిప్ట్‌లను ఎంచుకోవడమే ఇకపై తన ప్రాధాన్యత అని ఆమె స్పష్టం చేశారు. ఇకపై సినిమాల విషయంలో బిగ్ బ్యానర్ లేదా జానర్ ప్రాధాన్యత కంటే, తను పోషించే పాత్రకు ఎంతవరకు ప్రాధాన్యం ఉందనేది ముఖ్యమని రకుల్ తెలిపారు. కేవలం తెరపై కనిపించడం మాత్రమే కాకుండా, నటిగా తనను మానసికంగా ఉత్తేజపరిచే మరియు కొత్తదనంతో కూడిన సవాలుతో కూడిన పాత్రలనే అంగీకరిస్తానని ఆమె స్పష్టంచేశారు. ప్రముఖ దర్శకుడు నితీశ్ తివారీ ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న పౌరాణిక చిత్రం 'రామాయణం'లో రకుల్ శూర్పణఖ పాత్రలో కనిపిస్తున్నారు. రణ్‌బీర్ కపూర్ (రాముడు), సాయి పల్లవి (సీత), యష్ (రావణుడు), కాజల్ అగర్వాల్ (మండోదరి) ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం మొదటి భాగం నవంబర్ 6న అంతర్జాతీయంగా విడుదల కానుంది.



Printed & published owned by K.SRAVAN KUMAR. Printed Published RK PRINTING PRESS at 6-1-948 Boyawada Street Nalgonda.Pin : 508001. Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. RNI.NO.APTEL/2009/29433.(CELL ) 9866330400 prajaveekshanam@gmail.com